సత్యనారాయణ, కాకరపర్తి

కనకాంగి

రాజమహేంద్రవరము, 1923

Record no. 193

Satyanārāyaṇa, Kākaraparti

Kanakāṅgi

Rājamahēndravaramu, 1923

Record no. 193

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

సత్యనారాయణ, కాకరపర్తి.
కనకాంగి / కాకరపర్తి సత్యనారాయణగారిచే రచియింపబడినది.- 1. కూర్పు.- రాజమహేంద్రవరము : దేశీయ విద్యాలయ ముద్రణాలయము, 1923.
92, 2 p. ;17 cm.
Record no. 193

Satyanārāyaṇa, Kākaraparti.
Kanakāṅgi / Kākaraparti Satyanārāyaṇagāricē raciyimpabaḍinadi.- 1. kūrpu.- Rājamahēndravaramu : Dēśīya Vidyālaya Mudraṇālayamu, 1923.
92, 2 p. ;17 cm.
Record no. 193

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

1951

కనకాంగి.

(ఇరువదియైదు ప్రకరణముల నవల)

ఆకుండి వ్యాసనారాయణశాస్త్రిగారిచే సరిచూడబడియె.

ఇది

కాకరపర్తి సత్యనారాయణగారిచే

రచియింపబడినది

మొదటికూర్పు

1000 ప్రతులు

రాజమహేంద్రవర

దేశీయ విద్యాలయ ముద్రణాలయమున

ముద్రింపబడినది.

1923

వెల రు 0—12—0

DEDICATED

To

PRAKRUTI MATA.

By

the author.

యోగ్యతాపత్రములు.

P. Sambamurty, B. A., L. T.
HEAD MASTER.
M. V. H. School.
PALAKOL. Date 18—8—23.

I have had much pleasure in going through the "Kanakangi" of M. R. Ry. Kakaraparti Satyanarayana garu, an amateur in novel writing, and in noting that he succeeded very well in producing the proper spirit about it. The style is smooth and flowing; the imagery, ample and wellsuited and the thought modern and entertaining. Proper relief is afforded throughout, by apt reflections on the present day customs and by the introduction of humorous scenes like the Brahmin feast. The principal characters of the novel are brought out in proper relief.

So far it is alright and the author's attempt to give to the Telugu Reading Public a foretaste of one of the immortal works of the greatest of the English Dramatists is surely a laudable one. But the works would have shone better as a tragedy and Shakespere's purpose properly served there by. This prejudice aganist tragedies and tragic writings, which the author shares in Common with the Telugu Reading Public, is a long standing one, engendered in a way

by the Canons of Dramatic Composition in Sanskrit and Telugu.

Yet it Cannot but be conceded that a tragedy is far more effective and more true to life than a Comedy and that the objection against tragic writings is purely sentimental. Hence it is high time that the Telugu authors and public rise out of this old groove and cooperate to make a serious attempt to supply this one great omission of our litirature.

(Sd) P. Sambamurty.
18—8—23.

చిరంజీవి కాకరపర్తి సత్యనారాయణ చేత రచియింపఁబడిన కనకాంగియను చిన్న నవల నామూలాగ్రముగ వింటిని. కథాసందర్భము మనోహరముగ నున్నది. వర్ణన లింపుగా [illegible] మొత్తముమీద గ్రంథ మంతయు రసవంతముగ నున్నది.

రాజమహేంద్రవరము
తా. 30 సెప్టెంబరు 1923 } చిలకమర్తి లక్ష్మీనరసింహం

The style is easy flowing with nothing forced about it. Sometimes the author rises to the heights of poetic pathos in certain passages. The stanzas at the beginning of every chapter are an immitation of Scot.

The author's modest attempt may be encouraged by the public.

(Sd) U. Satyanarayana,
Dy. Inspector of Schools
TANUKU RANGE.

మ॥రా॥ కాకరపర్తి సత్యనారాయణగారు రచియించిన కనకాంగి యను నవలను వింటిని. అది చదువుటకు బాలురకు ఇంపుగాను నుపయుక్తముగాను నుండును. నీతిబోధకరముగా నున్నది. కథాసందర్భమును వర్ణనలును అనుకూలముగా నున్నవి. ప్రతిప్రకరణమున నమర్చినపద్యము లతిసొంపుగ నున్నవి.

చిట్టూరి. సూరయ్య
తాలూకాబోర్డు ప్రెసిడెంటు. తణుకు
ది 7—10—1923

మహారాజశ్రీ కాకరపర్తి సత్యనారాయణగారిచే రచియింపబడిన కనకాంగియనునవలను చూచితిని. అందుల కథాసందర్భము మిగుల నానందమును గొలుపు చున్నది. వర్ణనలును [illegible]లియు కడురమణీయముగా నున్నవి. దుష్టబుద్ధియుపన్యాసము, వసంతునియొక్క (Soliloquy) అతిసొంపుగనున్నవి. ప్రతిప్రకరణముకున్న ముందు సూచన చేయుచు, పద్యములు వ్రాయబడి యుండుటచే, బాలురకు నత్యంతోపకారమైనను. నీతిదాయకముగా నున్నది.

వ్యూరు.
11—10—23

K. Sarwarayudu
Union Board President
& M. L. C

TANUKU.
15—10—1923.

U. SATAYANARAYANA M. A., L. T.
Deputy Inspector of Schools.
Tanuku Range.

I have gone closely through the novelet 'Kanakangi' by MR. Kakaraparty Satyanarayana in Mss. It is a maiden attempt of the author.

Though there is nothing novel in the plot itself, being but a transcript of Shakespear's Othello, yet there is something naive in the handling of the theme.

The rich topographical details which greets the reader through the pages of the book is drawn from the author's lively imagination based upon his varied experience.

What is more refreshing is the way in which the Character of Kanakangi is portrayed. The Scenc of Vasanta's infatuation in the later stages of den'ouement is entirely of the author's invention being loathe to end his story as a tragedy so opposed to the Hindu sentiment. To me at any rate the author appears at his best in the Comic Couplet parodyzing minister Yugandhar's Current couplet. Dustabudhi's unmotivated villainy is brought out before us quite effectively.

The Greek idea of nemesis is not suppressed but kept in the fore front in making Vasanta mad.

శ్రీ

—: ఉపోద్ఘాతము. :—

ఈప్రపంచమునం దొకొక్కకాలమున నొకొక్కక నూతనయభిరుచి జనులకుఁ బొడముచుండును. ఇట్టియభిరుచి కాలనైసర్గికమును బట్టిగాని సంఘనైసర్గికమును బట్టిగాని కలుగుచుండును. జగమందును బ్రకృతియందును నిట్టివింతమార్పులు గలిగియుండుటచేతనే, జగమింత మోహనాకృతిని గలిగి యున్నది.

పూర్వము నన్నయాదులు సంస్కృతగ్రంథముల నాంధ్రీకరించి యాంధ్రదేశమునకు గొప్పయుపకార మొనర్చిరి. తరువాతఁ గొందఱు కవులు ప్రబంధముల వ్రాయఁదొడఁగిరి. కొంతకాలమున కవి మారి నాటకములు వచ్చినవి. వాటికి సరియైనపోషకులు లేకపోవుటచే నచిరకాలములో నవి క్షీణించెను. ఇప్పు డిప్పు డీయాంధ్రభాషావధూటి యనేకజన్మములఁ బడసి తుదకీనవలాకృతిని బొందినది. ఇఁకను నెన్నిజన్మము లెత్తవలయునో. నవల వ్రాయుటకు మార్గముజూపినవా రాంగ్లేయులు.

నేను కథాసందర్భములఁ గొన్నిటి నింగ్లీషు మహాకవి యగు షేక్సుపియర్ నాటకములనుండి గ్రహించి కాలోచితమును దేశాచారములకుఁదగునట్లుగనునా యిచ్చవచ్చినమార్పులఁ

గావించిరి. నే నీగ్రంథము విషాదముతో ముగింపదలంచియు దేశాచారమునుబట్టి సంతోషముతో ముగించితిని.

ఈనవలారచనయందు నాకు సాహాయ్యపడి హెచ్చరించిన నాబంధుమిత్రగణంబుల కనేకవినయపూర్వకవందనము లాచరించుచున్నవాఁడ.

కాకరపఱ్ఱు.
11—10—23

గ్రంథకర్త.
కాకరపర్తి సత్యనారాయణ.

కనకాంగి.

—: ఒకటవ ప్రకరణము :—

చ॥ కనుఁగొనలేక నిన్నిచటఁ గండి మనంబునఁ గుందుచుంటి, నో
వనితరో! నిన్ను జూడ సమభారముఁ జెందినతాత్రిసురీతి నా
మన మిఁక నిశ్చలంబయి సముచితనిర్మలభావ మొందె; నే
మని వచియించువాఁడ గడు నక్కజముల్ మనస్నేహ
జాలముల్॥ సుగుణమణీ.

అంధకారము బ్రహ్మాండము నంతయు నావరించి కన్నులు గలవారినిఁ గూడ గ్రుడ్డివారినిఁ జేయుచున్నది. ధనవంతుల గృహంబుల నుండు ధనాదులను దొంగిలింపఁ దలఁచు చోరులకును, పక్షిసంతానములను బట్టి పల్లార్చు పాపిఘూకములకును, శ్మశానవాటికలలోఁ దిరుగాడు బ్రహ్మరాక్షససమూహంబులకును నానందంబుఁ గలుగఁజేయుట కుద్భవించి నల్లనిచీరను ధరించినకామినీకాంతయో యన రాత్రి యాయెను. పగలంతయు మిగుల రమణీయముగఁ గానుపించు ప్రకృతియంతయు ఘోరాకారమై చూపరులకు భయమును గలిగించుచుండెను. పొదలు మొదలగుచిన్నచెట్లు భయంకరాకారము గలిగినమనుష్యాకృతిని దాల్చి చేతితో సంజ్ఞ చేయుచున్నట్లును నింకను ననేకవికారపుపనులఁ జేయుచున్నట్లును గానవచ్చుచుండెను.

ప్రపంచమంతయు నిద్రపోవుచున్నట్లుండెను. ఆసమయమునం దెట్టిధ్వనులును వినవచ్చుట లేదు. దూరమునం దచ్చటచ్చట పడవకేకలును గడియారపుచప్పుడును కొద్దిధ్వనితో వినవచ్చుచుండెను. కాపువిషయమై యుంపఁబడినకుక్కలమొరుగులు కూడ నచ్చటచ్చట వినవచ్చుచుండెను. అత్యంతానురాగులగు స్త్రీపురుషాదులును, దొంగతనమునకు వేచియుండు చోరులును, దురాత్ములగు జారులును బ్రపంచనమున రోఁతజనించి యాత్మహత్యఁ జేసికొనుటకు సంసిద్ధులయినవారును, దుర్మార్గాలోచనఁ జేయువారును దక్క తక్కిన వారందఱు హాయిగా నిద్రించుచుండిరి. రాత్రిఁ గాపుగాయ్య, నియమింపఁబడిన రాజభటులు నిద్రాదేవతనుజయింపఁజాలక యేకోశనో యేచెట్టునో, చేరి నిదురించుచుండిరి.

రాజపుత్రిస్థానమునం దాసమయమునఁ జామునచారం కలిగినమనుజుఁడొకఁ డతివేగముగ నడచుచుండెను. అతఁడు మిగుల శరీరదార్ఢ్యము గలవాఁడును యుద్ధములం దారితేరి యోధునివలెను గానవచ్చుచుండెను. అతఁడు కొంతదూరము వేగముగ నడచి యొకసౌధము వెనుకనున్న యుద్యానవనములోని కేతెంచి యొకవృక్షమునంటుకొని వేచి యుండెను. అతనిమనము పరిపరివిధంబులఁ బోవుచుండెను. అతఁడు తనలోఁ దానిట్లాలోచింపఁదొడఁగెను.

“ఇంకను రాకపోవుట కేమికారణమై యుండునో! ఇదివరకే యిచ్చట వేచియుండెద ననిచెప్పినకాంత యింక

రాకపోవుటేమి? ప్రేమాస్పదలు నియమితకాలమునకు ముందే చేరవలసినస్థానములఁ జేరుదురుగదా! ఆమె కేదైనఁ గీడుమూడియుండకుగదా! ఆమె కేదైన నాపత్తుసంభవించిన నేను బ్రదుకఁగలనా! యని పరిపరివిధంబుల నాలోచించుకొనుచుండెను. చివరకెటుకున్న మనఁదన ప్రేయసి రాక యని యాతఁడు బ్రమసి నెమ్మదిగ ప్రేయసీ—ప్రేయసీ యని పిలుచుచుండెను.

మోహాతురులకు స్వల్పకాలమైననధిక కాలముగఁ గానవచ్చునుగదా! నిమిషములు యుగములుగ మారెను. మనసు పరిపరివిధములఁ బోవును. ఆనందభయాస్పదములగు నాలోచనలాతనిమానసము నంకురించుచుండెను.

ఇట్టుండఁ గొంతసేపునకేదో ధ్వనియాయెను. భయాస్పదుల కన్నియు భయకారణములే కదా!

“అయ్యో! ఎంత వెదకినను గానకున్నావు. నా ప్రాప్తి యిందును. నాతండ్రి నన్నుఁ గ్రూరసేనున కిచ్చి వివాహము జేయుచున్నాఁడు. నేనెంతచెప్పినను వినకున్నాఁడు. నీవు నాకిష్టుఁడు గనుపింపకున్న మనప్రయత్నములన్నియు నిష్ఫలమగు న,, నుమాటలు వినవచ్చెను.

“అదిగో! నాప్రేమపుంజమగుకనకాంగి నన్నుఁ గానక విలపించుచు నిటు వచ్చుచున్నది. నేనామెను జేరెదగాక యని యాతఁడు కనకాంగిపైపున కేగెను.

కనకాంగి తనప్రాణప్రియుఁడగు వసంతునిగాంచి, మోహా

తురతతో నాతని విభుజనీమయందు, దనహస్తముగమున మోఁది వేసి "హా, నాథా,, యని కేక వేసి మూర్ఛఁ జెందెను.

వసంతుఁడామె సమీపమునకట్టి శైత్యోపచారంబు లొనరించుచుండెను. ఇట్లుండఁగొంత సేపున కామె తెప్పిరిల్లి తనప్రియమిత్రుని ముఖారవిందమును గనులారఁ గాంచి "నేను మీకొఱకనేకవిధంబుల నీవనంబునంతయు వెదకితిని మిమ్ముల నెచ్చట గానక విలపించుచుంటిని. నాతండ్రి నన్ను గ్రూరసేనున కిచ్చి వివాహముచేయనున్నాఁడు. కావున మనమాతని బారినుండి యెట్లుతప్పించుకొనగలుగుదుమో కదా! మనమిచ్చటనుండరాదు. యెచ్చటికైనను బోవలయునని తొందరఁజేయ నుభయులు నుద్యానవనము విడిచి ప్రయాణముఁ జేయుచుండిరి.

—♦—

రెండవ ప్రకరణము

తే॥గీ॥ మనసు కుదురు నేనిఁ గురూపి మన్మథుండు।
కుదరకుండిన నలరాజు కోఁడముచ్చు।
మనమనోభావనలె కాని మందయూస।
మంచిచెడ్డలు లేవు సుమ్మెంచిచూడ॥

చంద్రిక

సన్మార్గులు మంచియాలోచనలు చేయుచుండ, దుర్గులు దురాలోచనలు చేయుచుందురుగదా! వసంతుఁడు కనకాంగిని తనతండ్రియొద్దనుండి యర్ధరాత్రంబునఁ దీసికొ

ఁటి క్రూరసేనుఁడు గ్రహించి తనకు భార్యగా నుండఁదగు కనకాంగి వసంతునకుఁ దక్కుచున్నదని కడుగుంది యెట్లయిన విఘ్నము గావింపయత్నించుచు దాస్యమున కాలవాలమైన తనమిత్రుడు దుష్టబుద్ధివద్దకుంజని "మిత్రమా కనకాంగినినీవు నాకు వివాహముచేయించెదనని చెప్పితివి. ఆప్రయత్నము దీవించుకయును శ్రద్ధవహించుట లేదు. నీవునా ప్రాణమిత్రుడవుగనుండి నాకార్యము లన్నిటిని నీవిగభావించి నాకు సాహాయ్యభూతుఁడవగుదువనుకుంటిని. గాని యిట్లుచేతువనుకొనువని యెన్నడును తలంపలేదు. వసంతుఁడు కనకాంగి నింగొనిపోయెనఁట. ఇంక నాకు కనకాంగి యెట్లుదక్కును,, అని చెప్పెను. అందులకు దుష్టబుద్ధి మిత్రమా! నీవు నన్నన్యథాగాఁ దలంపవలదు. నేను నీ ప్రాణమిత్రుని గాని వేఱొకండనుగాను. నేను నీవిషయమై యెట్టిప్రయత్నములు చేయుచున్నానో నీకే తెలియఁగలదు. కాబట్టి మన మిప్పుడే వెళ్లి కనకాంగితండ్రియగు శౌరిమాన్యుని కీయుదంతము తెలియఁజేసి వసంత కనకాంగులను బట్టించు ప్రయత్నములఁ జేయుదము,, అని యుభయులును శౌరిమాన్యుని యింటివైపుకు జేరిరి.

దూరమున విద్యుచ్ఛక్తివలన ప్రకాశించెడు దీపములు వెలుంగు కిటికీలగుండ నీవలకుఁ గానవచ్చుచుండెను. తెల్లవారుజామగుటచే పక్షులు కిలకిలలాడుచుండెను. పంటకాపులు పొలములకేగుచుండిరి. తూర్పుదిక్కు ఎఱ్ఱబారుచుండెను. శౌరిమాన్యుడింకను నిద్రనుండి లేవలేదు.

అపుడు క్రూరసేన దుష్టబుద్ధులు శూరమాన్యుని యింటివద్దకే తెంచి "అయ్యా! మీరింకను నిద్రించుచున్నారా? మీకు సంభవించినవిపత్తు మీరింక గ్రహింపలేదు కాఁబోలు చూచుకొనుఁడు-త్వరపడుఁడు; అని కేకలు వేసిరి.

శూరమాన్యుఁడా కేకలు విని తనభృత్యులతో లేచి గృహంబంతయు వెదకికొని కుమార్తెను గానక విలపింపసాగెను,

ఈయల్లరివలన పెక్కుమంది యచ్చటికిఁ జేరిరి. అందులో నొకఁడు ముందుకువచ్చి "ఎవరోయిద్దరు భార్యాభర్తలువలె నున్నారు- మనగ్రామమునకు పడమటివైపుననున్న కనుమల మార్గమును బట్టి వెళ్లుచున్నార"నెను.

శూరమాన్యుఁడామాటలువిని, యిట్టి కృత్యము వసంతునిదిగ గ్రహించి వారినుభయులఁ బట్టి తెచ్చుటకు కొందఱు ఖడ్గహస్తుల కశ్వముల నిచ్చి యాకనుమల మార్గమునఁ బంపెను. వారతివేగముగఁ బ్రయాణమొనర్చుచుండిరి.

కనకాంగి కడునలసి పోయినది. పాలగచ్చుపైన నడచిన కందెడు పాదములతో నాకనుమ మార్గంబుల నెట్లు వడిగా నడువఁగలదు. భయాతురత చేతదన ప్రియునితో నెట్లెట్లో వేగముగనడచుచు చాంబల్ నదియొద్ద కేగిరి. ముందు ప్రయాణమునకు వారావలగట్టునకుఁ జేరవలెను. రేవుపడవావలగట్టున నున్నది. పడవవాని నెన్ని కేకలు వేసినను వాఁడీవలిగట్టునకు రాలేదు.

దూరమునందు గుఱ్ఱపుడెక్కల చప్పుడు వినవచ్చుచుం

డెను. కనకాంగి తననాథునిచెంతఁ జేరి, "నాథా! నాతండ్రిచే నియమింపబడి మనలను బట్టుటకెవ్వరైన రారుగదా" యని భయపడుచుండెను. "కాంతా! ఏమియు భయము లేద"ని వసంతుఁడామెకు ధైర్యముచెప్పుచుండెను. ఇట్లుండ కొంతసేపున కశ్వారూఢులయిన తనతండ్రి సేవకులామెకుఁ గనబడిరి. వారినిఁ జూచి యామె "మిత్రమా! మనయాశలన్నియు నడుగంటినవని యేడ్చి మూర్ఛపోయెను.

అశ్వారూఢులు పెక్కుమంది యుండుటచే వసంతుఁడు వారి నేమియుఁ జేయఁజాలక పోయెను. వారు వసంతకనకాంగుల నిరువురిని బట్టి తెచ్చి శూరమాన్యునెదుట నిలిపిరి. తండ్రియెంతబోధించినను గనకాంగి వసంతునిదక్క తానన్యుని వరింపఁజాలనని చెప్పెను. వసంతుఁడు రాజకుటుంబములోనివాఁడు కాకపోవుటచే వానికిఁ దనకుమార్తె నిచ్చి పరిణయమొనర్చుటకు శూరమాన్యుని కించుకయు నిష్టము లేదు. శూరమాన్యుఁడు తనకుమార్తెను మందలించుటకు చతురుపాయముల నుపయోగించెను. కాని యేమియు లాభము లేకపోయెను.

సరియైనయనురాగమున్న నెవ్వ రేమిచేయఁగలరు? ఒకమనుజుఁడు పరాక్రమముచే గుఱ్ఱమును నీటియొద్దకు తీసికొని వెళ్ళఁగలడు. కాని పదిమందియైన నిష్టములేనిచో దానిచే నీరును ద్రావింపజాలనట్లు, శూరమాన్యుఁడెట్టి ప్రయత్నములు చేసినను తనకుమార్తెను మందలింపఁజాలక పోయెను. కాఁబట్టి

రోషపూరితుఁడై యీసంగతి ప్రభున కెఱింగింపఁ దలఁచెను.

కనకాంగికి వసంతునిపైఁ బొడమినయనురాగ మతిస్వచ్ఛమైనది. కడు నిర్మలమైనది. ఆమెకాతనియం దుద్భవించిన యనురాగమున కామె నిర్మలమనస్సే కారణము. ఆమె యాంతరియందమును మెచ్చి వరింపలేదు. వారియుభయులకు పరస్పరానురాగ ముద్భవించినది.

—:o:—

—: మూఁడవ ప్రకరణము. :—

ఉ॥ ఎవ్వనిమెచ్చునోపడఁతి యెవ్వనికిన్ హృదయంబునిచ్చునో
యవ్వరుఁగూర్పఁ గావలయునంతియకానితదన్యుగూర్చుచో
నవ్వనజాక్షికిన్బతికి హాయిగఁ గాపురమొప్పదెప్పుడున్
మవ్వఁపుగమ్మసంపగికి మైత్రి ఘటిల్లునె తేఁటితోఁ గుతన్
చంద్రహాస.

ఒకానొకగొప్పమైదానముగలదు. అందు మధ్యభాగమున నొకదివ్యభవనముఁ గలదు. దానిచుట్టు నొకకందకముండెను. ఆకందమున కచ్చటచ్చట సౌధమునకు నాలుగుప్రక్కలందును చిన్నవంతెనలు నిర్మింపఁబడియున్నవి. అవి రాత్రులందు పైకెత్తుటకును పగటివేళఁ దీసి యుంచుటకును దగియుండెను. కందకముచుట్టునున్నమైదానములో ప్రాతఃకాలమందును, సాయంకాలమందును, గుఱ్ఱపుదళములు, కాల్బలములు తమనడకలను నేర్చుకొనుచుండును. కందకముదాటినతరువాత

సౌధప్రాకారద్వారమున గొప్పస్తంభ మొకటికలదు. దానికొకగంట కట్టబడి యున్నది. కాలము తెలుపుట కచ్చటగంటలు కొట్టబడుచుండును. ఆస్తంభమువద్దనుంచి మందిరము కడ కొకవెడల్పయినబాట గలదు. ఇట్లనే నలుప్రక్కలను ద్వారములవద్దకు బాటలు గలవు.

విశాలమై కడురమణీయముగ నున్నయామందిరమున లోపలిభాగమునఁ జిత్రవర్ణములచే ప్రకాశించుచున్న దివాన యొకటి పరువఁబడి యుండెను. దానిచుట్టును గుర్చీలు గలవు. దానిమధ్యభాగమున నున్న నింద్రనీలమాణిక్యవేదికపై జయంతుడు కూర్చుండి తనమంత్రిజనంబులతోఁ దనరాజ్యపరిశోధనలను గూర్చి ముచ్చటించుచుండెను.

ఆసమయమునం దొకసేవకుఁడశ్వారూఢుఁడై యేతెంచి ద్వారముకడ నశ్వము నాపి లోపలికేగి రాజును గాంచి సాష్టాంగప్రణామంబులాచరించి "అయ్యా! శత్రుసేనలు మనదేశముపై దండెత్తనున్నవి. కాబట్టి తగుప్రయత్నంబులు గావింపవలసి యుండు," నని విధేయతో నుడివెను.

అంత శూరమాన్యుఁడు తనభృత్యులను వెంటఁబెట్టుకొని వసంతు నచ్చటికిఁ దీసికొనివచ్చెను. జయంతుఁడిదివఱకు వసంతునిబలపరాక్రమాదులువిని యున్నవాఁడు గాన నాతనిఁ జూచినవెంటనే, "వసంతకా! శత్రుసేనలు మనరాజ్యముపై దండు వెడలనై యున్నవి. కాఁబట్టి శత్రుసేనల నెదురించుట కీవు నాయకత్వము వహింపవలసినదని," కోరెను.

ఇంతలో శూరమాన్యుఁడు, "రాజోత్తమా! నాకెంత యుపద్రవము సంభవించినదో వినియున్నారా? ఈతఁడు స్నేహితునివలె నటించుచు నాయింటిగొద్దకు వచ్చుచుఁ దన వాక్చాతుర్యముచే నాకుమార్తెను దనవశము చేసికొని నాయనుజ్ఞ లేకయే, యాతండామెను నర్ధరాత్రంబున నాయింటనుండి తీసికొనిపోయెను. ఇట్టిదుష్కృత్యము మున్నెన్నఁడైన విని యుంటిమే? కావున మీరాతనికి తగినశిక్ష విధించి నాకుమార్తెను నాకిప్పింపవలె" నని రాజునుగోరెను. రాజదియంతయు నాలకించి వసంతుని గాంచి, "నీపైనేల యీనేరము వచ్చినదని యడిగెను. అందులకు వసంతుఁడు, "అయ్యా! నేనాయన కుమార్తెను వశపరచుకొనలేదు. నేనించుకయును ద్రోహము తలంపలేదు. నన్ను శూరమాన్యుఁడు తనగృహమునకు రప్పించి, నేనుజేసిన యుద్ధములనుగూర్చి యతివిచిత్రముగఁ బ్రశ్నించుచుండెడివాఁడు. కనకాంగి తనగృహకృత్యములను పెందల కడనే నెరవేర్చుకొని స్థిమితయై, నాకథల నన్నిటిని వినుచు, నాకష్టములను తనకష్టములుగ దలంచివిచారించుచు, నాజయమును తనజయముగ దలచి సంతసించుచుండెడిది. చాలకాలమునుండి యామెనన్ను వివాహమాడఁ దలంచియిట్లు చెప్పి, యామెనన్నే తొందరచేసి నావెంట వచ్చినది. ఆమెనన్ను వలవలేదని చెప్పిన యామె విషయమై నేనేమియు నాలోచింపను. కాబట్టి మీరామెను రప్పించి ప్రశ్నింపవచ్చు"నని చెప్పెను.

ఇంతలో నొకచెలికత్తెతో గూడి మేలుముసుగుతో

కనకాంగి సభామంటపమున కేతెంచి నిలువఁబడెను.

రాజామెనుగాంచి "అమ్మా! కనకాంగీ! వసంతుఁడు నిన్ను బలవంతముగఁ దీసికొనిపోవనెంచెనా? లేక నీవే యాతని వెంటనంటితివా?" అని ప్రశ్నించెను.

అందున కామె భయలజ్జాపరివేష్టితయై కొంతసే పేమియు మాటాడఁజాలక ధైర్యము దెచ్చుకొని, "తండ్రీ నన్ను క్షమింపుము. వసంతునియందించుకయును దోషములేదు. అతని చరిత్రలన్నియు విని నాతనియందు నాకనురాగ ముద్భవించినది. నే నన్యులను బరిణయ మాడఁజాలను. ఆతఁడే నాదైవము అని చెప్పెను. అందులకు శూరమాన్యుఁడేమియు మాటాడఁజాలక యూరకుండెను.

ఇపుడు కుమార్తెలకుఁ దలిదండ్రులు తమ యిచ్చవచ్చిన వరున కిచ్చి వివాహముఁజేసి బాలికలను దుఃఖసముద్రమున ముంచుచున్నారు. బాలిక తనవివాహమగు వరకు భర్త యెట్టివాఁడో యామెకుఁ దెలియదు. మూఢలగు మనబాలికలు తమ తల్లిదండ్రుల మాటల కెదురాడఁజాలక వారు చేసిన సంబంధములకు లోనై సంతోషదాయకములగు తమజీవితములను పాడు చేసి కొనుచున్నారు. (Love whom you marry) "వివాహమాడినవారిని ప్రేమింపు"మని మనవారియభిప్రాయము ఇదికొన్ని విషయములలో బాగుగానుండినను, కొన్నిటియందు దుర్భరమగు దుఃఖములు గలుగుచున్నవి.

కావున నాడుపిల్లలను గను నోతలిదండ్రులారా ఈ పుత్రికామణులను దుఃఖ సాగరముల పాలుచేయక సరియైన వయసు వచ్చినతరువాత వారియభిప్రాయమును బట్టి పాణిగ్రహణంబులఁ గావింపుడు. కలకాలము బ్రతుకబోవువారి జన్మమును మంటగలుపకుడు (Marry whom you love) ప్రేమించిన వారినే వివాహమాడు మనునాంగ్లేయ నార్యోక్తి మనదేశమునందు వ్యాపించునట్లు చేయుడు.

—:o:—

—: నాలవ ప్రకరణము. :—

తే॥గీ॥ అంతవరకును గాఢమై యలరు తమము।
యరుణు పొడగన్న మాయమై యులరునట్లు।
కుత్తుకలపైకి కత్తుల నెత్తుక్రోధ।
మైన శాంతించు సంధివాక్యములవలన॥

ఆరావళీపర్వతసామీప్యమున నొక పెద్దబయలు గలదు. అది రమారమి రెండుమైళ్ళ వెడల్పును, రెండుమైళ్ళపొడుగును గలిగి సమచతురముగ నున్నది. అందచ్చటచ్చట చిన్న పొదరిండ్లును, చిన్నగుట్టలును తప్ప వేరేమియు లేవు. ఆకాశము నీలవర్ణము గలిగి కళంకరహితమై నిర్మలముగ నుండెను. ఎత్తైయినయాకాశమును క్రిందవిశాలమైన బయలును జూడ నద్భుతముగ నుండెను. ఆబయలున నిలిచియుండి వాటినిఁ జూచిన పైనున్నయాకాశము భూదేవతపై వ్రాలి కలిసి యున్నట్లు

చూపరులకుం గానవచ్చుచుండెను.

అచ్చట శత్రురాజు తనసేనయంతయును జేర్చి యుద్ధమునకు సంసిద్ధుడై యుండెను. ఒకవైపునఁ గాల్బలమును ఇంకొకవైపున గుఱ్ఱపుదళమును నిలువఁబడి యుండెను. విచిత్రపు రంగులు కలిగినజండా లచ్చటచ్చట గానవచ్చుచుండెను. నాయకులు గుఱ్ఱములపై నుండి సేనలను పరీక్ష సేయుచు వారిని హెచ్చరించుచుండిరి.

వసంతుఁడు పరిణయమైనవెంటనే తనభార్యను వదలవలసివచ్చినందులకుఁ గొంచెము విచారించి తాను యుద్ధమునకేగవలయునను వృత్తాంతము నామె కెఱుక పఱచెను. "నీవిచట నుండుము. యుద్ధముముగిసినవెంటనే వచ్చెద"నని చెప్పెను. అందులకు కనకాంగి ప్రేమాపూరితమగుగద్గద స్వరముతో, "నాథా! మనము పడరానిపాట్లుపడి తుట్టతుదకు బరిణయమాడఁగలిగితిమి. కాన మిమ్ముల విడచి నేనొక్కనిముసమైన నుండఁజాల నేను కూడ మీతో వచ్చుటకు సెలవిండు" అని పలికెను.

అందులకాతఁడు "కాంతా! నీవు యుద్ధభూమికి రాఁజనదు. కావున నిచ్చటనే యుండుము. శీఘ్రముగ వచ్చెద"నని చెప్పెను. అందుల కామె, యించుకయు నిష్టపడక "నాథా! నేనొంటరినై యుండఁజాల"నని చెప్పి భర్తను వెంబడించెను.

సేనలనడకలచే భూమి రేగి ధూళి యాకాశమున నంటు

చుండెను. శత్రుసేన లతిభయంకరముగఁ గానవచ్చుచున్నవి. సాయంకాలపుసూర్యకిరణములు సేనల కవచముల పైబడి వింతయందమును దెచ్చుచుండెను. రణరంగము కొద్దికాలములో నతిఘోరమై కానవచ్చె. రసపుత్రయోధులు శంఖములఁ బూరించుచుండిరి. వసంతుఁడుతోకతొక్కినత్రాచుచందంబున నుగ్రుఁడై శత్రుసేనలపైఁ బడెను. కనకాంగి తనభర్తకుఁ దోడు పడుచు, వీరపత్ని యను నామంబును సార్థకము గావించుచుండెను. ఎచ్చటఁ జూచినను పీనుఁగులమయమై యుండెను. రుధిరం బేఱులై పాఱుచుండె. తలలు నరకబడి కొన్ని మొండెములు కొంతవఱకుఁ బరుగెత్తి పడిపోవుచుండెను. ఎచ్చటఁజూచినను భయంకరమగుధ్వనులు వినవచ్చుచుండెను.

అప్పు డొకయుద్ధభటుఁడు శరణను సూచించు జండాను జూప యుద్ధమాగిపోయెను. ఆభటుఁడు వసంతునియొద్దకేతెంచి "అయ్యా మాసైన్యములు పూర్తిగా నశించినవి. మారాకొమరులు యుద్ధమందు మడిసిరి- మమ్ములఁ గావబ్రార్థించుచున్నాము." అని చెప్పెను.

వసంతుఁడు దయార్ద్రహృదయుఁడు. కాన వారికి శరణనిచ్చి మిగిలినసేనను వారివారిదేశములకుఁ బంపివేసెను.

ఆహా! వసంతుని యౌదార్య మేమని చెప్పనగును.

యుద్ధము ముగిసెను. చల్లనిపిల్లవాయువులు వీవఁజొచ్చె. ప్రభాకరునికిరణములం దించుకయు వేడిమి లేదయ్యె. ఆకిర

ణములవలన బంగారునీరానినట్లు పచ్చని చెట్లయాకులు తళతళ మెఱయుచుండెను. పృథ్వియందున్న భూరుహానికురుంబ మపుడు చూడ మిగుల నానంద మొసగుచుండె. ప్రభాకరునిమిత్రుఁడైన చంద్రుఁడు తనయనుగ్రహమువలనఁ గాంతిపొంది కాలానుసరణముగఁ దనకళను హెచ్చుతగ్గులుగాఁ గనఁ జేయుచు నొక్కసారి తనప్రభ గనఁ జేయుటకో యన షోడశకళాపరిపూర్ణుండై మింటికెక్కఁ జూచుచుండెను.

—-—

అయిదవ ప్రకరణము.

ఉ॥ బాగొనరింప నేరికిఁ బ్రపంచమునన్ సులభంబుగాదను।
మ్మోగొనరింప నెంచునకు నొక్కనిమేషము పట్టుదేరికే।
లాగన, నాకుఁజిల్కఁగఱులంబలురంగులు వేయగష్ట మా।
నూఁగును రాల్చివేయుటకు నూఱుప్రయత్నము లేల
మిత్రుఁడా॥ శ్రీసూక్తి వసుప్రకాశిక

దుష్టబుద్ధి వసంతునికి మిత్రుఁడుగా గానుపించుచున్నను లోలోపల గుట్రలు చేయుచుండెను. వసంతుని యౌన్నత్యమును జూచి యాతఁడోర్వలేకుండెను. క్రూరసేనుఁడు దుష్టబుద్ధియొక్క దౌర్జన్యమును హెచ్చరించుచుండెను. క్రూరసేనుఁడు ధనవంతుఁడు, ఆతని ద్రవ్యముచే దుష్టబుద్ధిని తనయిచ్చవచ్చినట్లు నడిపించుచుండెను.

ఆహా ధనమెట్టి కార్యములయిన జేయించునుగదా!

"ధనమూల మిదంజగత్" కావున ధనవిషయమందు నరుడు తనక్షేమమును కోరు తల్లిదండ్రులను తనకై ప్రాణమర్పింప జూచు సతిని దనకు ప్రాణమిత్రునినైనను నమ్మరాదు. అను నార్యోక్తి రిత్తపోవునే, ధనమువలన కానిపనులు ప్రపంచమున నేవైనఁగలవా? కాన క్రూరసేనుని ద్రవ్యము దుష్టబుద్ధి కార్జన్యమును హెచ్చరించుచుండెను.

వసంతుఁడు జయసూచన చేయుటకు పట్టణమునంతయు నలంకరింప నియమించెను. తనస్నేహితులనందఱిని రప్పించి మిత్రులారా! మనమందఱు మీదినము నతిసంతోషముగ గడుపవలయును. ఎట్టిదుర్వ్యసనములను మనముచేరనీక సత్కాలక్షేపము గావింపవలెనని చెప్పెను.

ప్రజలందఱును మిగుల నానందముగనుండిరి. పట్టణమంతయు పందిళ్లు వేయఁబడియుండెను. అరఁటికంబము లతివిచిత్రముగఁ బందిలిరాటల కమరుపఁబడి యున్నవి. కాగితములతో నిర్మింపఁబడిన విచిత్రవస్తువులు పందిళ్లకు గట్టఁబడియున్నవి.

జయభేరీలతో వసంతుఁడు ప్రభువైన జయంతుని ప్రక్కను గూర్చుండి యూరేగెను. పట్టణవాసులందరును ప్రభువునకును వసంతునకును హారతులిచ్చిరి. ఆపగలంతయు నుత్సవములతో ముగిసెను.

జయసేనుఁడు వసంతునిసేనలో దుష్టబుద్ధితో బాటొక నాయకుఁడుగ నుండెను. దుష్టబుద్ధి నాయకత్వమందు జయసేనునికన్న ప్రథముఁడైనప్పటికిని జయసేనునికిఁ గలయుద్ధనైపు

ణ్యమును బట్టి వసంతుఁడాతనియందు గౌరవముంచి సేనయందతనికి గొప్పపదవి నిచ్చెను.

దుష్టబుద్ధి కప్పటినుంచి వసంతిజయసేను లుభయుల యందును గొప్పయీసు జనించి, యెట్లయిన వీరినుభయులను గష్టములపాలు చేయనెంచెను. లోలోప నీతఁడెట్టికుట్రలు పన్నుచుండినను చూపరులకు వీరియం దత్యంతానురాగ మున్నట్లు నటింపఁజొచ్చెను. వసంత జయ సేనులు నిష్కపటులు. కాన దుష్టబుద్ధి తమ ముఖ్యస్నేహితుఁడని భావించిరి. కాని తమకై యీతఁడు పన్నుచున్న వ్యూహము నించుకయు గ్రహింపఁజాలకపోయిరి.

సకల సంపన్నంబగు నీప్రపంచంబను నాట్యస్థానమును భగవానుఁడు సృజించి తన ప్రదర్శనమునకు సరిపోయెడు పాత్రలను సరిచూచుకొని కపటనాటకముల నాడించుచున్నాఁడు. మననాటకములందలి పాత్రలు యజమానుని యాజ్ఞచొప్పున రసాదుల నన్నిటిని ఖేలనమొనర్చునట్లు మనమందఱు మీప్రపంచక రంగస్థలమునందు, భగవానుఁడగు యజమానుని యాజ్ఞచొప్పున నాటకమాడుచున్నాముగదా! ఈ సృష్టికర్త తనయానందమును దీర్చుకొనుటకో, లేక యెవరికర్మనుబట్టి వారు నడువక తప్పునా యనియో, దుష్టబుద్ధివంటి దుర్మార్గపు పాత్రములను సృష్టించుచున్నాఁడు.

—:o:—

తే॥గీ॥ మాయమార్గంబులనియెడు మళ్ళలోన|
బురుషకారబీజంబులఁ బోసినాఁడ|
నోయదృష్టమేఘమ! యిట్టి యురిమిచనక|
కురియఁగదె సహాయపు వృష్టిఁగోర్కెపండ॥

చంద్రహాస.

ఉత్సవము పట్టణమునం దెల్లెడలను జరుగు చుండెను. జనులందఱు వసంతునియాజ్ఞచొప్పున హరికథాకాలక్షేపముల తోను, భక్తిరసయుక్తములగు నితరపనులతోను కాలము గడుపుచుండిరి.

ఇట్లుండ నొకయానందభవమున క్రూరసేన, జయసేన దుష్టబుద్ధ్యాదులొక చిత్రమంటపమునఁగూర్చుండియుండిరి.అపుడు దుష్టబుద్ధి, మిత్రులారా! వసంతుఁ డీరేయి తనభార్యతో సంతోషముగఁ గాలముబుచ్చుచుండును. కాని యీవలకురాడు కాబట్టి యీరేయంతయు మన మిచ్చవచ్చినట్లు పాచికల నాడుకొంద మని చెప్పెను.

జయసేనుఁ డందుల కిష్టములేనివాఁడైనను దుష్టబుద్ధివాక్చాతుర్యమునకులోనై తానుకూడ పాచికల నాడఁ జొచ్చెను. రాత్రి మిగుల ప్రొద్దుపోవువఱకు నాట సాగించిరి. ఆయాటలందు క్రూరసేనునకు, జయసేనునకును మనస్పర్ధలు గలిగెను. అందులకు వారిరువురును పోట్లాడఁజొచ్చిరి. దుష్టబుద్ధి తనమాయోపాయముచే జయుసేనుని గొన్నిమత్తుపదార్థములను దినున

ట్లుచేసెను. జయసేనుఁడు మత్తుఁడై, మైమరచి, కలహమందు క్రూరసేనుని దూషించుచు గొప్ప గగ్గోలు గలిగించెను. దుష్టబుద్ధిజయసేనునిపక్షమువానివలె నటించుచు కలహనివారణము చేయువానివలెఁ గానవచ్చుచుండెను.

ఈగగ్గోలంతయు వసంతుఁడు గ్రహించి, యచ్చటికేగి జయసేనుని దుష్కృత్యమును జూచి మిగులఁ గోపించి "జయసేనా! నీవుసద్వంశమున జనించిననీతిపరుఁడ వనుకొంటిని గాని నీవిట్టితుచ్ఛపుపనులకు లోనై నాయాజ్ఞను తిరస్కరించి నీయిచ్చవచ్చినట్లు సంచరించుచు జనులకు హానిచేయుదువని తలంపలేదు. నీవు నీతివంతుఁడవని, దురభిప్రాయముననిన్ను నాతో బాటు యుద్ధమున గొప్పపదవియం దుంచితిని. అట్టి నీకిట్టి దురాచరణంబు కర్తవ్యమే? నేను నీకుఁ జేసినయుపకారమునకుఁ దగిన ట్లొనర్చితివి. నేను నిన్నింకఁ జూడంజాలను. నీవు నాతో పనిచేయుట కర్హుండవు గావని భీకరముగఁ బలికి వెడలిపోయెను.

అందులకు జయసేనుఁడు లజ్జచేఁ దల వంచి యూరకుండెను. దుష్టబుద్ధి జయసేనునియం దెక్కుడు నేరము లేదనియు, క్రూరసేనునకును, నాతనికిని వచ్చినమాటపట్టింపులో నిట్టియల్లరులు జరిగెను. కాని వేఱొండుగాదని జయసేనునిపక్షమున నుడువువానివలె నటించెను.

వసంతుఁడు దుష్టబుద్ధిమాటలు విని, 'మిత్రమా! నీసుగుణములచే నాతని దుర్గుణములు సుగుణములుగ నీకుం

గానుపింప, నాతని నేరము నీవు గ్రహింపఁజాలకున్నావు. ఆతని కనేకవిధంబుల "నీరాత్రి యెట్టిదుర్మార్గపుపనులును జేయరాదు. దుర్మార్గు లెవరైన దుర్వ్యాపారముల నున్నవారిని మందలింప వలసిన" దని నేఁడాతనికి గట్టిడిసేయ నాతఁ డిట్లొనర్పవచ్చునే? వానిముఖదర్శనము పాపహేతువు. వాని నే నిఁక జూడజాల నని చెప్పి వసంతుఁ డచ్చటినుండి వెడలిపోయెను.

జయసేనుఁడు లజ్జాపరివేష్టితుఁడై, యేమియు మాటాడ జాలక తనగృహమున కేగెను.

"ఇపుడుగదా నాయాశాభూరుహము మొగ్గదొడఁగ మొదలుపెట్టుచున్నది. నాచమత్కృతిచేతనిష్కపటుఁడగుజయసేనుని దుర్వ్యసనమునం బెట్టి వసంతుని కప్పగించి యాతని నుద్యోగభ్రష్టుని గావించుచుంటిని. ఇంకను చేయవలసినపను లన్నియు ముందే యున్నవి. ముందు నేనాడంబోవు కపటనాటకమున కే నెన్నిదుర్మార్గము లొనరింపవలయునో గదా! ఎన్నిదుర్మార్గములు చేసినైనను మనుజుఁడు తనముఖ్యోద్దేశమును నెరవేర్చుకొనుట పురుషలక్షణము. అనేకవత్సరములనుండి పనిచేయుచున్న నన్నుగాక జయసేనునికి నాపదవి నిచ్చుటకు వసంతుఁడెవఁడు? ఇంక వసంతజయసేనాగు లేమిచేసెదరో చూచెదనుగాక! వారి నుభయులను ముప్పుతిప్పలను బెట్టి మూడుచెరువులనీరు ద్రావించినపుడుగదా దుష్టబుద్ధియొక్క ప్రావీణ్యము వెల్లడియగు" నని చెప్పి ముందునాటకమునకుం దగుప్రయత్నములఁ జేయుటకు వెడలిపోయెను.

—: ఏడవ ప్రకరణము. :—

ఉ॥ ఆపదలొక్కటం దగులునప్పుడె ధీరుఁడుసుస్థిరుండగున్
కాపురుషుండుకష్టములఁ గాసిలి నిల్వక సంచరించెడున్
దాపునఁ దీవ్రమారుతముదండడిముట్టిన, బెండునిల్వగా
నోపక పాఱుఁ బోనిలిచియుండ వెమ్రాఁకులుసుస్థిరంబులై!
సత్యహారిశ్చంద్ర.

జయసేనుఁడు తనగృహమున కేగి యొంటరియై యొక గదియందు గూర్చుండి యిట్లు విచారింపఁ దొడంగెను. "వసంతుఁడు నాయందు మిగుల నమ్మికగలవాఁడై నన్నౌన్నత్యమునకు దెచ్చుటకుందగు ప్రయత్నంబు లాతఁడు చేయుచుండ నే నెంతదుష్కార్య మొనర్చితిని. దుష్టబుద్ధి చెప్పినంతమాత్రమున నే నామత్తుపదార్థములను భుజించి యామాయాద్యూత మాడ జెల్లునే? ద్యూతమాడితిబో నాకు దురాగ్రహంబు వచ్చి క్రూరసేనునితో వివాదమాడ నేల? వివాదమాడితినిబో అప్పుడచ్చటికి వసంతుం డేలరావలయు.

"ఆహా! నాగౌరవ మంతయుఁ బోయినదే? గౌరవము పోయినమనుజుఁడు చచ్చినవానితో సమానమే. ఇప్పుడు నే నేమి చేయఁగలను. వసంతుని యాగ్రహమునుండి నన్నుఁ గాపాడువా రెవరు? నాప్రియమిత్రుఁడగు వసంతుఁడు నాపై నాగ్రహింపఁ నా కింక దిక్కేమి? పాప మాదుష్టబుద్ధి నావిషయమై చెప్పంబోవ నాతనిపలుకు లించుకయును బాటింపక పోయెను." అని పరిపరివిధంబుల విచారించుచుండెను.

ఆహా! జయసేనుఁడింకను దుష్టబుద్ధినిం దనమిత్త్రునిగాఁ దలపోయుచుండెను. తనవిపత్తుల కితఁడే మూలమని యాతఁడించుకయు గ్రహింపలేకపోయెను. ఎట్టిసేనానియైన నేమి? ఎట్టి విద్వాంసుండైననేమి? జయసేనుఁడు దుష్టబుద్ధి నైసర్గికమును గ్రహింపఁ జాలకపోయె గదా!

జయసేనుఁడు తనకు సంభవించిన కష్టమును గూర్చి విచారించుచుండ తలుపువద్ద నేదో ధ్వని యాయెను. అపుడు జయసేనుఁడు తలుపుదీయ దుష్టబుద్ధి లోపలికివచ్చి కూర్చుండెను. "జయసేనా! నీవిట్టిదానికి విచారింపనేల? ప్రమాదమున సంభవించిన కలహమునకు నీవేమిచేయఁగలవు. గడచిన దానికి వగవంబనియేమి? ఆపదలందు ధైర్య మవలంబించుట సత్పురుషులధర్మము. కాబట్టి కర్తవ్య మూహించెదగాక "యని కొంతసేపాలోచించి, "మిత్త్రమా! నీవుదీనికై వగవంబనిలేదు. వసంతుండుతనభార్యయగు కనకాంగియందత్యంతానురాగుఁడై యున్నాఁడు. ఆమెచెప్పినచొప్పు నాతండు నడుచుకొనును. కనకాంగి దయార్ద్రహృదయ. నీకుంగలిగిన యాపత్తు నామెకు విన్నవించినచో నామె నీపై కనికరముం బూని తనభర్తతో నీవిషయమై చెప్పినీకు నీయుద్యోగమును దిరిగి యిప్పింపక పోదు. కావున నామె దర్శనమునకుంబొమ్ము. నేను నీకుఁ జేయఁగలిగినంత సాహాయ్యము చేయుచుండెద"నని చెప్పి వెడలిపోయెను.

జయసేనుఁడు తనకు దుష్టబుద్ధి చెప్పినయాలోచనకు మిగుల సంతసించి "ఉండిన నిట్టిమిత్త్రుఁడే యుండవలయును.

గొప్పస్థితియం దున్నపుడందఱును మిత్త్రులే! ఆపత్సమయమున నష్టపడువారేకదా సహజమిత్త్రులు. దుష్టబుద్ధి యందఱవలెగాక, కడుయోగ్యుండు. ఈతని యాలోచననుబట్టి నాకు నా పదవివచ్చునని తోచుచున్నది. దుష్టబుద్ధి నుడివినట్లు కనకాంగి కడుయోగ్యురాలు. తగినసమయమును గ్రహించి యామె సన్నిధి కేగుటకు సంసిద్ధుండనై యుండెద"నని యనుకొనెను.

—:⊙:—

ఎనిమిదవ ప్రకరణము.

తే॥గీ॥ ఘోరకృత్యంబు లొనరించు వారి నెల్ల।
పట్టిబంధించి శిక్షల పాలుచేసి।
రాజ్యపాలన మొనరించు రాజు లభ్య।
మగుట చూడంగ ప్రజల భాగ్యంబుగాదె॥

ఆరావళీ పర్వతప్రాంతమున గొప్పకనుమలు గలవు. పూర్వమవి దోపుడుగాండ్రకు నిలయములుగనుండెడివి. పిండారీలు, తగ్గులు మొదలగువారం దచ్చటచ్చట నివాసులుగ నుండి యప్పుడప్పుడు సామీప్యగ్రామములపైఁ బడి దోచుచుండెడివారు. వారుఘోరకార్యముల జేయుచుండిరి.

ఆదినములలో సరియైన మార్గములు లేవు. ధూమశకటములు గాని, తంతిమార్గములుగాని లేవు. తపాలా వ్యవహారములు మొదలగునవి గుఱ్ఱములు మొదలగు వడిగా ప్రయాణముచేయుజంతువులసాహాయ్యమున జరుగుచుండెడివి.

ప్రయాణము లతిభయంకరములుగ నుండెడివి. ఎచ్చట

జూచినను దోపిడిగాండ్రు. వీరు మిగులభయంకరాకృతి గలిగి సాధులగు బాటసారులను బట్టి పీడించుచుండెడివారు. ఈ దోపిడిగాండ్రు గ్రామములను కొల్లగొట్టి యందుండు ధనధాన్యాదులను దొంగిలించుటయేగాక పసిపిల్లలను స్త్రీలను నతిదారుణముగ బాధింపఁ జొచ్చిరి. వారు తల్లుల వడినుండి చంటిపిల్లలనీవల కీడ్చి గిరగిరఁ ద్రిప్పుచు నేలను వైచి కొట్టుచుండిరి స్త్రీల నతిదారుణముగ బాధించుచుండిరి.

పాపమా స్త్రీలు తమపిల్లల యవస్థనుజూడలేకయు, తమమానముఁ గాపాడుకొనుటకును నాత్మహత్యలొనర్చుకొనుచుండిరి. ఆ దోపిడిగాండ్రు మనసులు వజ్రకాఠిన్య మగుటచే నెట్టి దౌర్జన్యములు చేయుటకును వెరువరు. భూతదయయనునది వారి కించుకయును లేదు. వారు ఖైదీలుగాఁ దీసికొనిపోబడినవారిని చర్మములఁజుట్టి యందుతుపాకి మందును గట్టించి వెలిగించుచు వారు పడుమరణబాధ నతివిచిత్రముగాఁ జూచుచు నానందించుచుండెడివారు.

హిందూదేశమునఁ గొంతకాలమిట్టి దౌర్జన్యములు ప్రబలమగుసరికి యింగ్లీషువారి ప్రభుత్వము బలపడుచుండెను. ఈ ప్రభుత్వమువా రిట్టిదుర్మార్గుల నందరిని నశింపు చేసిరి. అప్పటినుండి దేశమునం దిట్టిదురంతములు లేవు. కాని యటునంటి దుర్మార్గు లింకను పూర్ణముగ నశింపలేదు. ఇంకను గొందఱచ్చటచ్చట నుండిరి. వారిలో ముఖ్యుఁడు కపాలకుఁడు

వాఁడు దోపిడిగాండ్రందరకును నాయకుఁడుగ నుండి యొకకొండగుహాయందు నివసించుచుండెను.

ఆగుహాయందొకదివ్యభవనము గలదు. ఆదివ్యభవనమునందచ్చట గోడలకు మాణిక్యములు కెంపులు మొదలగు కాంతిరత్నములమర్పబడి యున్నవి. ఆగుహ యంధకారబంధురమైన దైనప్పటికి నీరాళ్లవలన కాంతిగలిగి పట్టపగటివలె గానవచ్చుచుండును. ఆభవనమం దెచ్చటఁజూచినను విచిత్రమగు వస్తువులును ధనాగారములును గలవు.

ఈ భవనమున మధ్యభాగమున నొకసభామంటపము గలదు. అందు కపాలకుఁ డనుదినమును తనసహాధ్యాయులందఱితోను గూడి ముచ్చటించుచుండును. వా రీవిధముగ మాట్లాడుకొనఁజొచ్చిరి.

1 వ దొంగ— కపాలకా! మన మీ చుట్టుప్రక్కల నున్నగ్రామంబుల నన్నింటిని దోచి మనధనాగారముల నిండించితిమి.

2 వ దొంగ:— మన కింక డబ్బు కేమియు గొదువ లేదు. కాబట్టి రాజపుత్రస్థానములోని గ్రామములపై బడి యక్కడి స్త్రీలను బట్టి తెచ్చి వివాహ మాడుదము.

3 వ దొంగ — రాజపుత్రస్థానములోనివారు బహు బలవంతులు. వారితో మనము పోరాడలేము.

అని యీవిధముగ మాట్లాడుచుండఁ గపాలకుండు మిత్రులారా రాజపుత్రస్థానమున నాకు ముఖ్యస్నేహితుఁడు

దుష్టబుద్ధియను నాతఁ డొకఁడు గలఁడు. ఆతఁడు నాకొక జాబువ్రాసి యున్నాఁడు. ఆజాబునుబట్టి మనము రాజపుత్రిస్థానముపై దండెత్తవలసియుండు"నని చెప్పి కొలువు చాలించెను.

— —

తొమ్మిదవ ప్రకరణము.

ఉ॥ కొండెములన్ వచించి తమకున్ వశవర్తులఁ జేసి
కొంద్రుభూ|
మండలిలోన వంచకులమాయ తెఱుంగుట శక్యమా నె॥

... ...

వసంతుఁడు జయసేనుని దిరస్కరణ స్వభావమునకును తా నాతని శిక్షించుటయు మొదలైన సంగతుల నాలోచించుచుండ దుష్టబుద్ధి యాతనివద్దకువచ్చెను. జయసేనుఁడు వసంతుని యాగ్రహమునకు బాలుపడి నప్పటినుండియు, దుష్టబుద్ధి వసంతుని పరమ మిత్రుఁడాయెను. కాబట్టి వ్యవహారములన్నియు వసంతుఁడు దుష్టబుద్ధితో నాలోచించుచుండెను.

వసంతుఁడుదుర్మార్గుఁడనిజయసేనునిదూషింప, దుష్టబుద్ధి సమయోచితముగ జయసేనునిపక్షమున మాట్లాడునట్లు నటించుచు నాతనిపై దోషారోపణ చేయుట మొదలు పెట్టెను.

"వసంతా! నీవు నిష్కపటుఁడవు ప్రపంచమంతయు నీవలె నిష్కాపట్యమును బూని సంచరించు ననుకొందువు. మేమందరము నీకు భృత్యులమైనను నీవు మమ్ముల సగౌరవము

గఁ జూచుచుందువు, నీభృత్యులయం దెట్టినేరము లున్నను వాటిని మన్నింతువు. కాలము మంచిదికాదు. ఖడ్గముచేఁ బరిపాలించెడిరోజులు గాని కరుణతో పరిపాలించెడిరోజులు కావు. దుర్మార్గులు సన్మార్గులవలెఁ గానవచ్చుచు సాధుజనాళికిం గష్టము గలిగించుచున్నారు. పెద్దలన గౌరవము నశించినది. ప్రకృతియంతయు వికృతిగ మారుచున్నది. ఉద్యోగస్థులు తమగౌరవమును జెరిపి తుచ్ఛపుపనులకు లోనగుచున్నారు. ఆత్మగౌరవమును జంపుకున్నమనుజుఁడు మనుజుఁడే? ధన మెట్టివానినైన దుర్మార్గునిగఁ గావించుచున్నది. ధనము మనుజుని యవివేకునిగ నొనర్చుచుచున్నది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు మనుజుల నాశ్రయించి ప్రపంచమున గగ్గోలు పుట్టించుచున్నవి. మనుజుఁడు తనపొట్ట పోసికొనుట కతిదారుణములఁ జేయుచున్నాఁడు. పాపమని యెంచఁడు. పుణ్యమని యెంచఁడు. సోదరీభావమునఁ జూడఁదగుస్త్రీరత్నముల నన్యథా చూచుచున్నాఁడు. అందుచేఁ బ్రపంచ మంతయు పాపభూయిష్ఠమై యున్నది.

ఇంతపాపమా! ఇంతారడియా! లోకము పాడుపడెనా? ఇది సత్యము. ఇది యసత్య మనువారు లేరే. పురుషునకు భార్యయన రోత జనించు చున్నది. స్త్రీకి భర్తయన నసూయ జనించుచున్నది. ఇతఁడేకపత్నీవ్రతుఁడు ఈమె పతివ్రతయని యెవరు నొక్కి వక్కాణింపఁగలరు. ప్రపంచ మంతయు పూర్తిగ మారిపోవుచున్నది. అట్టిచోఁ బంటలు సరిగా పం

డునా? సరిగా వర్షములు కురియునా? అట్టిచో నెవరు దారిద్ర్యబాధలేక సుఖముగా జీవింతురు"

ఈవిధముగ దుష్టబుద్ధి చెప్పుచున్న యుపన్యాసమును వసంతుఁ డాలకించి ప్రపంచమున నీతనికన్న ననుభవశాలు రెవ్వరు నుండ రని తలఁచి యాతనియందు పూర్వముకన్న వేయిమడుంగు లనురాగము గల్గి యాతని తనప్రాణపదంబుగఁ దలపోయుచుండెను.

దుష్టబుద్ధి యుపన్యాసమందు జయసేనుని గూర్చి యేమియు లేకపోయినను నది వినినప్పటినుండియు వసంతునికి జయసేనునిపై నీ సధిక మాయెను.

సూర్యుఁ డపరాబ్ధికిం జనెను. జయసేనునిశత్రులో యనఁ జిమ్మచీఁకటులు ప్రపంచము నంతయు నలముచుండెను. జారచోరుల కపరిమితానంద మొదవెను. ప్రపంచమంతయు లోకబాంధవుని వియోగమునకు దుఃఖించుచున్నదో యన్నట్లు కాటుకనీరుంబోలు కాఱుచీకటి యావరించెను.

పదియవ ప్రకరణము.

కం॥ చెడుశకునము, చెడుకలయును।
జెడుహాయమును, జెడుగ్రహంబు, జెడుస్నేహంబున్।
జెడుపొత్తము నిజముగఁ దమ।
చెడుతెనముం జూపకుండ జెందవుతృప్తిన్॥

చింతామణి.

ఉద్యానవనమంతయు సుందరమైనలతాకుసుమగుచ్ఛసముదాయముతో నిండి, చూపరుల కానంద మొసఁగుచుండెను. ఆల్లిగబిల్లిగ నల్లుకొనిన లతామధ్యమునుండి యెవ్వరును నడువ శక్యము గాకుండెను. ఒకవైపున జిలుకలును, గోరువంకలును, మనోహరముగాఁ గూయుచుండెను. తుమ్మెదలు మకరందము నాప్యాయనముగఁ ద్రాఁగి మత్తెక్కి పూబాన్పుపై విశ్రమించుచుండెను. మందమలయానిలయము నెమ్మదిగ వీచి జనులశ్రమను బోగొట్టుచుండెను.

అందచ్చటచ్చట లతాభవనములు గలవు. అవి ప్రేమాస్పదులకు వెన్నెలరాత్రులందు కేళికాగృహము లగును. అందు విచిత్రములై వివిధరూపములైన పక్షిజాలముల యాకారముతో గూడిననీటిగొట్టములు గలవు. వాటినోటినుండి నీరు చిత్రముగ పైకి లేచి క్రిందఁబడుచు, నీటిరేణువులను పైకి లేవగొట్టుచు వింతయందము గొలుపుచుండెను.

అట్టియెడ బంగారుబొమ్మయోయన నొక యువతీమణి యొకస్ఫటికవేదికపైఁ గూర్చుండి తనలో తా నీవిధముగ నాలోచించుచుండెను. "నిన్నరాత్రి నాకలలో నొక ఘోరాకారుఁడు కానుపించి నన్ను నానాథునినుండివిడదీసి నాకుపడరాని యిక్కట్లు గలిగించెను. తుదకు నన్ను నానాథునితోఁ జేర్చెదనని చెప్పి యంతర్ధానమాయెను. అదితలఁచికొనిన గుండె బ్రద్దలగుచున్నది. ఏమిపాటు రానున్నదో గాని తఱచు చిట్టదుస్వప్నములే వచ్చుచున్నవి. నానాథునితో నాకెడబాటు గలిగిన నేనొక్కఁ

గలనా? స్వప్నదోష పరిహారార్థమై నాయిష్టదేవతను బ్రార్థిం చెదను.

ఆమె యిట్లు మనోవైక్లబ్యమును జెందియుండ జయసేనుఁడచ్చటికేతెంచి, అమ్మా! నేను మొదటినుండియు మీభార్యాభర్తలయం దనురాగము గలిగి మిమ్ముల నాజననీ జనకులు కన్న నెక్కుడుగ భావించుకొనుచుంటిని. అట్టి నాకుఁగాలకర్మవశంబునఁ గష్టము ప్రాప్తించినది. నే నెన్నండును వసంతుని కెదురాడి యుండలేదు. మొన్నటి యుత్సవమునాడు కర్మవశమున వసంతునాజ్ఞ నుల్లంఘించి దుర్మార్గము నాచరించితిని. అది వసంతుఁడు గాంచి నన్ను దూషించి, యుద్యోగభ్రష్టుని గావించెను. అమ్మా ఉద్యోగమునకై విచారింపను. కాని యట్టి ప్రాణమిత్రునితో నిట్టి కలహంబు సంప్రాప్తమైనందుకు కడు గుందుచున్నాను. నీవే నాకు శరణమవు. నీవు నన్ను గాయకున్న మరణంబే శరణంబు మిత్రుని యనాదరణచే శోష జనించి ప్రాణంబు లడుగంటినవి, ఇపుడు నీయౌదార్యరసముచే శైత్యోపచారంబు గావింపకున్న బ్రదుకఁజాలనని దీనవదనుఁడై పలుకుచుండ, దూరమున నెవ్వరో యిద్దరుపురుషులు గానుపించిరి. అంతట జయసేనుఁడు, "అమ్మా! వసంతదుష్టబుద్ధులిటకు వచ్చుచున్నారు. నాకు వసంతునిజూచుటకు సిగ్గగుచున్నది. కావున సెలవి" మ్మనెను.

"జయసేనా! నీకు భయము వలదు. నానాథునితో నీసంగతియంతయుఁ జెప్పి నిన్ను మన్నించునట్లు చేసి నీయుద్యో

గపదవిని నీకిప్పించెద,, నని కనకాంగి చెప్పెను.

దూరమున దుష్టబుద్ధివసంతులు జయసేనకనకాంగుల నొంటరులై యుండుటఁజూచిరి వసంతుఁడు సదయహృదయుఁడు గాన నేమియు ననుకొనలేదు. దుష్టబుద్ధి వసంతుని కనుమాన ముద్భవించునట్లు తనలో దానేదియో సణగుకొనెను. సణగుటయం దక్షరము లేమియును లేకుండినను దానియందర్థము మాత్రమెక్కుడుగ నుండెను.

వసం—మిత్రమా! ఏ మనుచుంటివి?

దుష్ట— ఏమియులేదు కనకాంగితో మాట్లాడుచు నావలికి వెళ్ళినవాఁడు జయసేనుఁడేనా?

వసం— అవును—అయిన?

దుష్ట— ఏమియులేదు. నాసందేహనివారణార్థ మడిగితిని. అంతేకాని వేఱుకాదు.

దుష్టబుద్ధిమాట్లాడుచున్న ననుమానాస్పదములయిన మాటలవలన వసంతునకు కనకాంగియం దనుమాన మొదవెను కాని కనకాంగియొక్క సుగుణముల నన్నిటిని బాగుగ నెఱిగినవాఁడగుటచే పరిపరివిధముల నాలోచించుచుండెను.

పనియున్నదని చెప్పి దుష్టబుద్ధి వసంతుని వదలి వెళ్ళిపోయెను. వసంతుఁడు కనకాంగియొద్ద గూర్చుండి యుద్యానవనవిశేషములను గూర్చిముచ్చటింపఁ దొడగెను. కొంతసేపైన తరువాత కనకాంగి జయసేనుఁడెఱుగక చేసిన నేరమునకై పశ్చాత్తాపపడుచున్నాఁడు. కాబట్టి యాతని మన్నింప నావ్రా

ర్థన, యని చెప్పెను. ఆమెమాటల నాతనిమనమందు క్రొత్త కలవర ముద్భవించెను. కాని కనకాంగిదయార్ద్రహృదయయై జయసేనునిస్థితికి జాలిపొంది యిట్లనియుండ నోపు, నని తలఁచెను.

ఎట్లాలోచించినను దుష్టబుద్ధి యుపన్యాసములోనియర్థములు, ఇంతకుముం దితఁడు నటించిననటనము చూడ వసంతున కేమియుఁ దోచకుండెను.

వసం:—కాంతా! జయసేనుని నాప్రాణమిత్రునిగ తలపోయుచుండ నాతఁడు నాయాజ్ఞ నతిక్రమింపవచ్చునే?

కన:—పాప మాజయసేనుఁడు కర్మవశమున నిట్లు జరిగెనని చెప్పుచున్నాఁడు. కావునమన్నింపుఁడు.

వసం:—కొంచెమాలోచించి జయసేనుని మన్నించెదను. నాకు దేహమునం దస్వస్థతగా నున్నది. కావున పరుండవలయును.

అని చెప్పి వసంతుఁడు కనకాంగితోఁ దనయంతఃపురమునకుఁ బోయెను.

—:—

—: పదునొకండవ ప్రకరణము.: —

తే॥గీ॥ కాననంబున రేగిన కారుచిచ్చు।
వేములను గాల్చి మామిళ్ళ విడిచి చనునె।
మృగయునకుఁ బెద్దపులి యెంతొ మేకము నంతె।
దుష్టులకు సాధువులు నసాధువులు నొకటె॥ ప్రసన్నయాదవ

ఒకనాఁ డర్ధరాత్రింబున నొకపురుషుఁ డొకచోఁ గూర్చుండి తనలోఁదానేదియో యాలోచించు చుండెను. ఆతనిముందొకచిన్నదీపము వెలుఁగుచుండెను. ఆదీపమునెదుట నేదియోయొక కాగితమును జదువుచు "నిట్లు వ్రాసిన బాగుగ నుండునా? ఏవిధముచేనైన వసంతునికి నాతని భార్యపై ననుమాన మొదవునట్లు చేయవలయును. అనుమానమున కప్పుడే విత్తనము నాటితిని. అది కొద్దికాలములోనే మొలకెత్తి ఫలప్రాప్తికి వచ్చును. కాన దాని నతిజాగరూకతతోఁ బోషింపవలయును"

"కనకాంగిని జిక్కుపెట్టవలసివచ్చినందులకు నాకు మనమునఁ గడు విచారమగుచున్నది. కనకాంగిని గష్టపెట్టకున్న వసంతజయసేనులను వంచించు టెట్లు మున్ను విశ్వామిత్రుఁడు వసిష్ఠుని వంచింప నెంచి సాధుఁడగుహరిశ్చంద్రుని భార్యాపుత్రాదులతో బాధపెట్టలేదే? ఒక్కొకతఱి మంచివారుకూడ బాధపడవలసియుందురు. అందులకెవరేమిచేయఁగలరు: ఇనుమునుబట్టి యగ్నికిసమ్మెటదెబ్బలన్నట్లు వసంతునిబట్టి కనకాంగి కూడ బాధపడవలసియున్న"దని యనుకొనెను.

"నా చమత్కృతిచే వసంతునకు కనకాంగిపై ననుమాన మొదవునట్లు చేసితిని. ఇంక దానినెట్లో బలపఱుపవలయును" దుష్టబుద్ధి యిట్లాలోచించుచుండ నొకయువతి యచ్చటకేగి "నాథా! మీరెల్లపుడు నేదో యొకయాలోచన చేయుచు నన్ను మఱచి యుందురు. మీరునన్నిట్లుపేక్ష సేయుటకుకారణ

మేమో చెప్పవేడుచున్నా ననెను. అందుల కాతఁడు, "నర్మదా! నేనుని న్నెన్నఁడును పేక్ష చేయ లేదు. రాజకీయవ్యవహారములందు మనము నిలిపియుంటచే నీవిట్లాలోచించితివి గాని వేఱొండు కాదు. కాంతా! నేను నీకొకపని చెప్పెదను. చేసెదవా" అనెను.

నర్మ—చేయ కేమి?

దుష్ట—కనకాంగియొద్ద నున్న నల్ల బొట్లరుమాలును చూచితివా?

నర్మ—చూచితిని. దానినైపుణ్యమెక్కుడుగ కొనియా యాడుదురు. దానిని వసంతుని తల్లియాతని కిచ్చినదట.

దుష్ట—ఆ చేరుమాలును నీవు నాకొకసారి తెచ్చిపెట్ట గలవా?

నర్మ—తెచ్చిపెట్టలేకేమి; అని చెప్పి వెడలిపోయెను.

నర్మద వెళ్లినతరువాత దుష్టబుద్ధి తనయాలోచనలకు మొదలుపెట్టెను. ఈ చేరుమాలుతోఁ గొంతనాటకమాడింప వచ్చును. కాని యింకొక పనికూడ చేసినమిగుల బాగుగనుండునని తలచి యొకకాగితమును దీసి యేదియో వ్రాసెను. ఆవ్రాసినచీటిని బడలపఱచి తనభార్యకై వేచియుండెను. ఎంత వేచియుండిన నేమియు లాభము లేకపోయెను. నర్మదయెంత ప్రయత్నించినను చేరుమాలు చిక్క లేదు.

దుష్టబుద్ధి తానుచేసెడి కుట్రనంతయు తెలియబఱచుచు క్రూరసేననకు జాబులు వ్రాయుచుండెను. కనకాంగి

క్రూరసేనునకు వ్రాసినట్లు జాబులితఁడు సృష్టించి క్రూరసేనునకు జాబులు వ్రాయుచుండెను.

క్రూరసేనుఁ డొకనాఁడు కనకాంగి వియోగమునకు మిగుల విచారించుచుండ నొకసేవకుఁ డేతెంచి యొకజాబును దెచ్చియిచ్చెను. ఆ జాబును విప్పి చదివెను.

"మిత్రమా! తమరు వ్రాసిన జాబుచూచి కడుసంతసించితిని. మీకు నాయందిట్టి దయ యుంటచే నేనెంత ధన్యురాలను. తమరు దుష్టబుద్ధి ద్వారా పంపుచున్న వస్తువు లన్నియు నాకందుచున్నవి. దుష్టబుద్ధి మనయందత్యంతానురాగుఁడై యున్నాఁడు. కాబట్టి మన సంకల్పము కొద్దికాలములోనే నెరవేరునని తోఁచుచున్నది. వసంతుఁడు రాజకుటుంబములోనివాఁడు గాకపోవుటచే నా కాతనియందించుకయు నిష్టములేదు.

గ్రహించవలెను. ఇట్లు

కనకాంగి.

క్రూరసేనుఁ డీజాబు చదువుకొని పరమానందభరితుఁడై పూర్వముకన్న కానుకలెక్కుడుగఁ బంపించుచుండెను. ఆకానుకలన్నింటిని దుష్టబుద్ధి స్వీకరించుచుఁ దగినట్లు చేయుచుండెను.

—:పండ్రెండవ ప్రకరణము:—

తే॥ గీ॥ చేతనులచేఁ బ్రయుక్తమౌ నచేతనంబు
నైన మన్యుల ప్రాణంబుఁ జనఁగఁజేయు॥

నర్మద కనకాంగికిఁ జెలికత్తెయై యామెయందనుగా

గముగలిగియుండెను. కనకాంగి తనకష్టములనన్నింటిని నర్మదతోఁ జెప్పుచుండెను. నర్మద తనభర్తవలె కపటస్వభావముగలది కాదు. ఈమె కనకాంగి కానందము గొల్పునట్లు కథలను జెప్పుచుఁ బాటలను బాడుచుండును.

ఒకనాఁ డీమె కనకాంగియొక్క చేరుమాలును గ్రహించుట కెక్కుడుగఁ బ్రయత్నములు గావించుచుండెను. ఆచేరుమాలు తనభర్త యెందులకుఁ దెమ్మనెనో యామెకించుకయును దెలియదు. తనభర్త యనురాగమును బడయుట కామె తనచెలికత్తెయొద్దనుంచి చేరుమాలును గ్రహింప నెంచుచుండెను.

ఇట్లుండఁ గనకాంగి తనభర్తచేఁ దనకుఁ బరిణయసమయంబున నీయఁ బడిన చేరుమాలును దనచేతియందుంచుకొని యుండి కొంతసేపున కేదో తొందరమీఁద నావలకు వెళ్లెను. ఆమె తొందరగ వెళ్లునపుడు పొరబాటునఁ దనహస్తమున నున్న చేరుమాలును గ్రింద విడిచెను. దానిని నర్మద దీసి పదిలపఱచెను. దానిని బట్టి తనభర్త తనయందు పూర్వముకన్న వేయిమడుంగు లెక్కువ యనురాగమున నుండునని తలంచుచుండెను. కాని దీనివలనఁ గనకాంగి కేమియిక్కట్టులు గలుగునో యామె యించుకయును దలంపలేదు. పనితొందరచే కనకాంగి యచటికిఁ దిరిగి రాలేదు. ఆమె ఆమాలు సంగతి పూర్తిగా మఱచిపోయినది.

నర్మద కొంత సేపచ్చట నుండి, కనకాంగి తిరిగి రాక

పోవుటంజూచి తాను తనయింటి కేగెను. దుష్టబుద్ధి యామెను గాంచి కాంతా! నేను కోరిన చేరుమాలును దెచ్చి యీయఁజాలక పోతివిగదా! త్వరితముగ ప్రయత్నము చేసి తెచ్చి యిమ్మని చెప్పెను. అందులకామె, "నాథా! మీరుకోరిన చేరుమాలిదిగో! మీకొరకై నా ప్రాణస్నేహితురాలిని మోసముచేసితిని. ఇది మీ కెందుల"కని యడిగెను. అందులకాతఁ డేమియులేదు అవసరమైన తిరిగి యిచ్చివేయవచ్చునులే యని మిగుల యాతురతతో దానిని బుచ్చుకొనెను.

ఏమికారణమునో, చేరుమాలును జూచి దుష్టబుద్ధి పరమానందభరితుఁడాయెను. దానిని జూచుకొనుచు తనలోతా నేదియో నాలోచించుకొనెను.

చేరుమాలా! నీవు ప్రాణరహితవైనప్పటికి నెన్నిపనులను జేయనున్నావో కదా!

నర్మద వెంటనే కనకాంగి యొద్ద కేగెను. కనకాంగి యింటఁ దనపనులను జక్కపెట్టుకొని నర్మద యొద్ద కేతెంచెను. నర్మదా కనకాంగు లుభయులు జయసేనుని గూర్చి మాట్లాడుచుండిరి.

నర్మ—జయసేనునికిని వసంతునకును మనస్పర్థలు గలిగిన సంగతి తెలియునా?

కన—నాకునిన్ననే తెలిసినది. జయసేనుఁడు దీనవదనుఁడై నాయొద్ద కేతెంచి తన్ను మన్నింప నా భర్తతోఁ జెప్పుమని నన్ను వేడెను.

నర్మ—జయసేనుఁడు కడుయోగ్యుఁడు. నాభర్త యాత

నితోజయసేనుని విషయమై చెప్పఁబోవ నాతఁడు మండిపడెనట.

కన—ఆతనివిషయమై నాభర్తతోఁ జెప్పితిని. ఆలోచించి మన్నించెద నని చెప్పెను.

వారిట్లు మాట్లాడుచుండ వసంతుఁ డచ్చటికి వచ్చెను. కనకాంగి యాతనిం జూడకయే, "జయసేనుని నాభర్త యాగ్రహమునుండి యెట్లు గాపాడఁ గలనో తెలియకున్న" దనుచు వెనుకకుఁ దిరిగి వసంతుని గాంచి వారిప్రస్తాపన నాపుచేసిరి. వసంతుఁడు తలను పంకించి కనకాంగిప్రక్కనున్న యొకకుర్చిపై గూర్చుండి యుండెను. వసంతునిరాకఁ జూచి నర్మదావలకు వెళ్ళెను. కనకాంగి తనమాటచే భర్తను సంతోషపఱుపఁదలంచెను. కాని యేమియుఁ బ్రయోజనములేకపోయెను. కొంతసేపైన తరువాత "జయసేనునిసంగతి యేమిచేయ నెంచి" రని కనకాంగి యాతని నడిగెను.

వసం—ఏమిచేయుటని నీయభిప్రాయము?

కన—మన్నింపుమని నాయభిప్రాయము.

వసం—నీయభిప్రాయమునుబట్టి నే నడచుకొనవలెనా?

కన—నడచుకొనవలదా, యని హాస్యముగా ననెను.

ఈమెమాట లన్నియు నాతనిహృదయమున ములుకులై తాకుచున్నవి. "నడచుకొనవలసివచ్చినచో నడచుకొనెదనులే" యని యచటినుండి యామె యేదియో చెప్పుచున్నను వినక వెడలిపోయెను.

—:—

పదిమూడవ ప్రకరణము.

చ. మనుజులుసత్యమే యనిభ్రమంపడ మోహనమైనమూర్తిదా
ల్చి, నరుని నాల్కకు న్వగటుసేయక దాక్షులువోలెఁదియ్యనై
ఘనములుగూర్తు, సౌఖ్యములఁదార్తు విపత్తు హరింపనేర్తు వో
యనృతమ! నీవు చేసెడి సహాయము తల్లియుఁ జేయ లేదుగా॥

చంద్రహాస.

వసంతుఁడు కొంతకాలమునుండి మనసునందుస్థిమితము లేనివాఁడై తన పనియందు హెచ్చరిక లేకయుండెను. రాజీసంగతి గ్రహించి ప్రశ్నింప, "అయ్యా! నాకు దేహముసందస్వస్థతగా నున్నది. కానొకనెల సెలవిండని కోరెను. కోరినసెలవును రాజు వసంతున కిచ్చెను.

ఒకనాఁడు వసంతుఁ డొంటరియై తనభార్యయొక్క చరిత్రను గూర్చి తనలో తాను పరిపరివిధంబుల నాలోచించుచుండెను. తనకన్నులను తానునమ్మజాలకున్నాఁడు. ప్రపంచమంతయు మిథ్యయని తలపోయుచు, దుష్టబుద్ధియొక్క యుపన్యాసమును గూర్చి యాలోచించుచుండెను.

దుష్టబుద్ధి యలవాటుచొప్పున వసంతునిజూచుటకు వచ్చెను. వసంతుఁడు దుష్టబుద్ధితో, మిత్రమా! నీవు నాయందు సరియైనయనురాగముంచి మర్మము విడిచి మాట్లాడుము నామనసు మనసున లేదు. నీవు నన్నిట్లు సందిగ్ధమందుంచిన నాప్రాణములు పోవును. కాబట్టిమర్మము విడిచి మాట్లాడు మనెను.

దుష్ట— నేను నీవద్దనేమియుఁ దాచుటలేదు. నేను నిన్ను సందిగ్ధమందుంచిన దేమి?

వసం—నీవు నన్నింకను నన్యథా యాలోచించుచుంటివి. నీవు నాప్రాణమిత్రుఁడవు. నాప్రాణములను గాపాడుము నీకు జయసేనకనకాంగులను గూర్చి తెలిసినసంగతియంతయు నాతోఁజెప్పుము.

దుష్ట—మిత్రమా!ఏమియిట్లనుచున్నావు.జయసేనుఁడు పరమమిత్రుఁడు. కడుయోగ్యుఁడు కనకాంగి పతివ్రతాశిరోమణి సుగుణరాసి. అయ్యో! వారిని గూర్చి నీవంత సందేహపడనేల?

వసం— మిత్రమా! నీవు నన్నింకను నమ్మవా? నాకు నీవు వారిసంగతి చెప్పకపోయినను వారిచరిత్రలనుగూర్చి నీవానాఁడు చెప్పినట్టియుపన్యాసమునుబట్టి గ్రహింపఁజాలననుకొంటివా? నేనంత మూఢుఁడనా? అంతియేల? మొన్నమనముభయులమునుద్యానవనమునఁదిరుగాడుచో జయసేనకనకాంగులుభయులనొంటరులుగఁగనఁగొనినపుడు, నీవు సణఁగుకొనినదానియర్థమును గ్రహింపలేకపోతి ననుకొంటివా! వేయేల! నీవు నాకు సరియైనసంగతి చెప్పెదవా? చెప్పవా?

దుష్ట—నీవంతబలవంతము చేయుచున్నావు. కాన చెప్పుచున్నాను వినుము. వారుభయులును కడుమంచివారే కాని కొంచె మనుమానమున్నట్లు కిందవంతి గలదు. అయినను దానిని గూర్చి మనమాలోచింపవలసినపని లేదు. ఎట్టినిందలు వచ్చినను హీనులనుండి వచ్చును. అట్టవాటినిగూర్చి మనమా

లోచించియనవసరముగ మనసు కలవరపెట్టుకొనుట మంచిది కాదు.

వసం—దుర్మార్గా! నీవన్నియుఁ గప్పిపుచ్చుచున్నావుగా! సరియైనదృష్టాంతములతో సంగతియంతయును దెలియపఱచెదనా? తెలియపరుపవా?

దుష్ట—అయ్యో! మిత్రమా! ఇదియేమి? నేనేమియు నెఱుంగను. నన్ను మన్నింపుము.

వసం—ఇదిగో! సరియైనసంగతి దృష్టాంతములతోఁ దెలియపఱుపుము. లేకున్న నిన్నీకరవాలంబున కెరఁజేసెదనని చెప్పి వరనున్నఖడ్గమును బైటికి లాగెను.

దుష్ట—వసంతా! నీవు నన్ను నీప్రాణమిత్రునిగఁ దలపోయుచున్నావు. అట్టిచో నాకుఁ దెలిసినసంగతి నీకు వెలిబుచ్చకుండుట న్యాయముకాదు. కాన సంగతి దెలియపఱచెదను వినుము. నీకు నల్లని బొట్టుగలిగిన తెల్లనిచేరుమాలొకటున్నదా?

వసం—ఉన్నది, అది మాతల్లి నాకొసంగినది. దాని చరిత్రయత్యద్భుతము. నేను దానిని వివాహసమయంబున కనకాంగి కిచ్చితిని.

దుష్ట—ఆచేరుమాలిపుడెచ్చటనున్నదో చెప్పఁగలవా!

వసం—చెప్పలేకేమి? కనకాంగియొద్ద నున్నది.

దుష్ట—ఆమెయొద్ద నున్నదా?

వసం—ఏమిట్లనుచున్నావు? లేదా?

దుష్ట—ఉన్నదో, లేదో? నన్నడుగ నేల? చూచిరమ్ము.

వసంతుఁ డేమియు మాటాడఁజాలక పిచ్చివానివలె నావలికి వెళ్ళిపోయెను.

పాపము! కనకాంగిని తనభార్యయని పిలుచుకొనుటకు కూడ వసంతునకు రోత జనించెను.

ఔరా! కాలమహిమ. తలఁచుకొనినంతమాత్రమున వజ్రకఠినహృదయముకూడ నీరగును. కనకాంగి యెట్టిచిక్కులలోఁ బడిపోవుచున్నది. అయ్యో! కలము వణఁకుచున్నది. కవిజన్మ మెంతపాపిష్ఠిజన్మమోగాని సన్మార్గుల యిక్కట్టులఁ జేతులార వ్రాయవలసి వచ్చుచున్నదిగదా! ఇపుడు పాపమా కనకాంగిని రక్షించువారెవరు? సన్మార్గుల కివి రోజులుకావు. దుర్మార్గులయాలోచనలు సఫలమునకు వచ్చునుగాని సన్మార్గుల యాలోచనలు బయటికిరావు.

దుష్టబుద్ధి తననేర్పరితనమునకు మిగుల సంతసించుచుఁ దనయింటి కేగెను.

—:o:—

—:పదునాల్గవ ప్రకరణము:—

తే. గీ. మాయురే నామపూర్వజన్మమున నెట్టి
దంపతుల బాపి వారు దుఃఖింపుచుండ
నవ్వుచుంటినో యీపాప మిప్విధమున
నడరి పొక్కింపఁజాలదే విధువగలదే.

చిత్రనళీయం.

జయసేనుఁ డేదియో యొకకాగితమునుదీసి తానిట్లు చదువఁదొడఁగెను.

“జయసేనకు—మీరు వ్రాయుజాబులు గ్రహించితిని మీరు నన్నెన్నఁడును మరువవలదు. జయసేనా! నీవే నా దైవమవు. నీటముంచినను పాలముంచినను నీదే భారము

కనకాంగి.”

ఏమి? నే నేపాపము నెరుగనే? ఏదుర్మార్గుఁ డీజాబు వ్రాసెనోగదా? నేను జాబువ్రాసినట్లును దాని కామె ప్రత్యుత్తరమిచ్చుచున్నట్లును గానవచ్చుచున్నది. ఆమె కడుపతివ్రత. ఏవరో దుర్మార్గు లీజాబు కల్పించినటు లున్నదని తనచేతనున్న చీటిని చేరుమాలునకుఁ గట్టెను.

ఇంతలో జయసేనునిభార్యయగు కళావతి యచ్చటికేగి “ఆర్యా! నాయందు మీకు కొన్నిదినములనుండి కోపముద్భవించి యున్నది. కారణము తెలుపరాదా? నేనేమి చేసితిని? నాయందేదైన నేరమున్న నన్ను మన్నింపరాదా. యనెను.

అందుల కాతఁడు తనభార్యను దగ్గరఁ జేర్చుకొని, “నాకుమనమందేదియో యాందోళముగ నుండును. నాకేమి యుఁదోచుట లేదు. వసంతునితో వైరముకల్గినందులకు నాకు విచార మొదవుచున్నది. అంతేకాని నీయందేమి నేరమున్న” దనెను.

దూరమున నొకపొదచెంత దుష్టబుద్ధి,వసంతులు వేచి యుండి యేదియోయాలోచించుచు జయసేనకళావతులఁ జూ

చుచుండిరి. దుష్టబుద్ధి వసంతునితో జయసేనునిచేత నున్న చేరుమాలును జూచితివా? యనెను.

వసం—నారుమాలే! ఇది యిచ్చటి కేల వచ్చినది?

దుష్ట—ఇంకను నన్నడిగెద వేల? ఆలోచించుకొమ్ము

జయసేనుఁడు మనోవైక్లబ్యముచేఁ గనులు మూసెను. అంత నాతనిహస్తముననున్న చేరుమాలును గళావతి దీసి దానిని బరికించి చూచి యది తననాథునిది కాదని తెలిసికొని "ఈచేరుమాలు నానాథునిదిగాదే? ఇదీతనికెట్లు వచ్చినది? దీని నేదో చీటియున్నట్లున్నదని దానిని విప్పి చదువుకొని "దుర్మార్గురాలా కనకాంగీ! ఎంతపనిచేసితివే యని మూర్ఛబోయెను.

దుష్టబుద్ధి వసంతునితో వింటివా? సంగతి యెట్లున్నదో? అని కళావతివద్దకు పరుగుపరుగున వెళ్లి చేరుమాలుతో పాటాచీటినిఁ దెచ్చి వసంతునిహస్తమున నుంచెను. వసంతుఁ డుత్తరమును గొంత చదివెను. కన్నులెఱ్ఱబారి కండ్లనుండి యేరులై నీరు గారుచుండెను. ఒడలు తెలియుట లేదు. పడిపోయెను. దుష్టబుద్ధి యాతని నచ్చటనుండి యావలకుఁ దీసికొనిపోయి యాతనిసౌధమునకుఁ జేర్చి తాను వెడలిపోయెను.

కనకాంగి తనభర్తయొద్దఁ గూర్చుండి మందులు మొదలగునవి యిచ్చుచుండెను. కొంతసేపున కాతఁడు తెప్పిరిలి నాకుఁ గడుపున నేదో సంకట మగుచున్నది. తల నొచ్చుచున్నది. కావున చేరుమాలుచే నాశిరమును గట్టిపెట్టుమని

కోరెను. కనకాంగి చేరుమాలు నొకదానిని దెచ్చి కట్టఁబోయెను. అంగుల కాతఁడు తనకది వలదనియు, పూర్వము వివాహసమయంబున కనకాంగికిచ్చిది నల్లబొట్లచేరుమాలు కావలయుననియుఁ జెప్పెను. కనకాంగి యెంత వెదకినను చేరుమాలు కనుపించలేదు.

కన:—ఆరుమా లెచ్చటనున్నదో కనుపించలేదు.

వసం:—ఊఁ కనుపించలేదా?

కన:—వెదకెదను. ఎచ్చట నున్నదో.

వసం:—ఉండవలసినచోటనే యున్నదిలే? వెదకుటెందులకు?

కన:—మీ రిటుల కొన్ని రోజులనుండి విపరీతముగా మాట్లాడుచున్నా రేమి?

వసం:—విపరీతమేమియు లేదు. నీవు నాయొద్ద నుండవలదు. ఆవలకు బొమ్ము—నాకు నిద్ర వొడముచున్నది.

కన:—జయసేనునివిషయ మేమిచేయ నెంచిరి?

వసం:—పాపీ! ఛండాలీ—నోరు మూయుము.

కన:—అయ్యో—ఇది యేమి— జయసేనునిమాట చెప్పినంతమాత్రమున నిట్లు మండిపడుచున్నారు.

వసంతుఁడు కనులు మూసుకొని యేదియో యాలోచించుచుండెను. భర్తయాగ్రహమునకుఁ గడుఁ గుందుచు కనకాంగి యావలకు వెడలి పోయెను.

—: పదునైదవ ప్రకరణము. :—

చం॥ ప్రవిమలమైన నీదుముఖపంకజముం గనులారఁ జూచుచుం
దవిలి త్వదీయవాగమృతధారలు శ్రోత్రపుటంబునన్ మహో
త్సవముగ గ్రోలుచుం ద్రిదివసౌఖ్యము భూతలమందె పొందునా
కెవఁడు ప్రసక్తి యేల? మఱి యేమిటి కన్యవిచారమాత్రలోన్॥

చింతామణి.

క్రూరసేనునకు కనకాంగిపై నాశ పోలేదు. దుష్టబుద్ధి యొక్క సాహాయ్యమున నాతఁ డామెను గ్రహింపవచ్చునని తలపోయుచుండెను. ఆమెప్రాపకమును బొందుట కాతఁడు దుష్టబుద్ధిచేతికిఁ గొన్ని వస్తువుల నిచ్చి యామెకుఁ గానుకగా నీయుమని చెప్పుచుండెను. అట్లనే చేసెదనని వస్తువుల నాతఁడు గ్రహించుచుండెను.

దుష్టబుద్ధి తన చమత్కృతివలనఁ గనకాంగి క్రూరసేను నకుఁ దన ప్రేమను వెల్లడిచేయుచు వ్రాసినట్లు జాబుల నాతఁడు వ్రాయుచు క్రూరసేనునకుఁ బంపుచుండెను. ఆజాబు లతఁడు చూచుకొని పరమానందభరితుఁడగుచుండెను.

ఇట్లు కొంతకాలము గడచెను. కనకాంగి తనకు త్వరితముగ లభ్యముకాలేదని మిగుల తొందరపడుచుండెను.

పాప మా క్రూరసేనుఁడు తనద్రవ్యమంతయు దుష్టబుద్ధి కిచ్చుచు, నది కనకాంగికిఁ జేరుచుండెనని తలఁచెను. కాని చాలకాలమిట్లు జరుగుచుండుటఁ జూచి దుష్టబుద్ధి తనను మోసముచేయుచున్నాఁ డనుకొని నిష్కర్షగ దానివిషయమై నొక్కియడుగుటకు క్రూరసేనుఁ డాతనియొద్ద కేగెను.

దుష్టబుద్ధి క్రూరసేనునిగాంచి, "క్రూరసేనా! నేను నీకొక జాబు వ్రాసితిని. దానిని నీవు చూచుకొనలేదా?"

క్రూర:—నాకు చేరలేదే?

దుష్ట:—అయ్యో! కొంప మునిగినది. అది వసంతుని హస్తమునఁ బడిన మనప్రయత్నము లన్నియు భగ్నమై నేను దోషి నగుదును.

క్రూర:—ఉత్తరముల కేమి గాని నామాట యేమి చేసితివి?

దుష్ట:—అంతయు సిద్ధమైనది. కొద్దికాలములోనే, మనప్రయత్నము లన్నియు సఫలములు కాఁగలవు. కావున నీవు తొందరపడవలదు.

క్రూర:—ఇంకను తొందరపడవలదని చెప్పుచున్నావా నేనీవిషయములో నెంతోసొమ్ము వ్యయపఱచితిని. నాధనాగారములోని సొమ్మంతయు వెదఁ జల్లితిని. ఐన నొక్కపనియైన సరిగా జరుగలేదు.

దుష్ట—నీవొక్కపనిఁ జేయవలయును. దానితో మనము జయమును పూర్తిగాఁ బడయఁగలము.

క్రూ—అది యేమి?

దు—కనకాంగికి జయసేనునిపై ప్రేమ మెండనుసంగతి నీవెఱుఁగుదువు గదా! జయసేనుఁడు బ్రతికియున్నంతకాలము మనము కనకాంగిని బడయుట దుర్లభము. కావున నాతనిం

జంపుటకుం దగుప్రయత్నంబులు గావింపవలెను.

కూ్రి—అయ్యో! ఆతని నేనెట్లు చంపఁగలను. ఆతఁడొంటరిగ నుండ నాకెట్లు లభ్య మగును.

దు—నీ వావిషయమై భయపడ నవసరము లేదు. రేపు రే యాతఁడు స్నేహితునింటికి విందున కఱిగి యొంటరియై వచ్చుచుండును. నీ వపుడు కాచియుండి యాతనిం గడతేర్ప వచ్చును.

కూ్రి—అట్లనే చేసెదను. అని యాతఁడు తనగృహమున కరిగెను.

దుర్మార్గా! దుష్టబుద్ధీ! ఎట్టిదుష్కృత్యము లొనర్చుచుంటివి? నీకుఁ బాపభీతి యించుకయును లేదా నీవు శిలవా? ఓగోముఖవ్యాఘ్రమా! కనకాంగివిషయమై యెట్టి దుర్మార్గ మొనర్చితివి? ఇపుడు సజ్జనుఁడగుజయసేనున కిక్కట్టులు గల్గించుటయేగాక యాతనిప్రాణంబులు దీయ నుంటివా? సాధుజనులకు హాని యొనర్చుటకు నీకు నెట్లు తోఁచుచున్నది. శత్రువులకైనను హానిఁ జేయుటకు మనసు పరితాపపడునే? అట్టిచో జయసేనుఁడు నీవు ప్రాణమిత్రుఁడవని తలపోయుచున్నతరి నీవిట్టిపాప మొనఁగూర్పవచ్చునే?

—: పదునారవ ప్రకరణము. :—

కం॥ తలవ్రాఁత తప్పిపోవునె।
యిల నెంతటివారికైన నెవ్విధినైనన్।
లలితాంగి ద్రుపదజాసతి।
పలువిధములఁ గష్టగతులు వడదే తొలుతన్॥

చమత్కారకథాకల్లోలిని.

పూర్వము హిందూదేశము హిందూరాజులచేఁ బరిపాలింపబడునపుడు మిగుల గొప్పస్థితియందుండెను. హిందూరాజులలో మిగుల ఘనులగు విక్రమాదిత్యుఁడు అశోకుఁడు, హర్షవర్ధనుఁడు మొదలగురాజులు దేశము నభివృద్ధిలోనికిఁ దెచ్చుటకుఁ దగినయేర్పాటులు గావించిరి. దేశసంరక్షణార్థము పనులను గావించుటయేకాక మనుజుల కైకమత్యమును, దైవభక్తిని గరపుటకు వా రచ్చటచ్చట దేవళముల నిర్మించియున్నారు. వారు వీటివిషయమై లక్షలకొలది రూప్యముల వ్యయపఱచిరి. జయచంద్రుఁడు హిందూరాజయ్యును, మహమ్మదీయులతో నాతఁ డేకీభవించుటచే వారీదేశమున పాదముఁబెట్టి పచ్చనిప్రదేశ మంతయు భస్మము గావించిరి. అదియే హిందూదేశమునకు దుర్దశకు మూలము. మహమ్మద్ ఘోరీ దేశముపై పెక్కుసారులు దండెత్తి దేవళముల నన్నింటిని గొల్లగొట్టెను. వానియందుండు ధన మంతయు నపహరించి వానిని బాడుపఱచెను.

రాజపుత్రస్థానమున రాజధానియం దొక దేవళము

కలదు. అదియు మహమ్మదీయులదురంతములకు లోఁబడినదగుటచేఁ బాడుపడియున్నది. సరియైన మరమ్మతు లేకపోవుటచే దానిపైఁ జిన్నమొక్కలు మొదలగునవి మొలచి దుష్టకీటకములకు నిలయమై యున్నది. దేవాలయ మిట్టిదుస్థితియందున్నప్పటికిని దేవతయొక్క మాహాత్మ్య మెక్కుడని యక్కడివారి నమ్మకము. ఎట్టిమాహాత్మ్య మున్న నేమి? కఱకుతురక లించుకయును వెఱువక యచ్చటనుండిన బంగారువిగ్రహమును ముక్కలు చేసి తీసికొని పోయిరి. ఇపుడు సగమువిరిగినరాతివిగ్రహ మొకటిందుకలదు. దానినిఁ జూచినవారు దానియందుగల శిల్పనైపుణ్యమును గూర్చి కొనియాడనివా రుండరు.

ఒకనాఁడర్ధరాత్రంబున నొకయువతి తనహస్తమున ఫలపుష్పాదులతో నున్న యొకబంగారుపళ్ళె ముంచుకొని తన గృహము వదలి నానాథుఁడు లేవకముందే నేనింటికిం దిరిగి వెళ్ళవలయు నని వేగముగ నడచుచుండెను. ఆమె పట్టణమంతయు దాటి యాదేవాలయమునొద్ద కేతెంచెను. కొంతసేపామె యచటఁ గూర్చుండి దేవిని ప్రార్థించి, దుస్స్వప్నదోషపరిహారార్థము దేవికి ఫలపుష్పాదుల నిచ్చి తనభర్తకు తనపైఁ గలిగిన యసూయకు గడుఁగుందుచుఁ దనగృహమును గూర్చి వచ్చుచుండ మార్గమధ్యమున జయసేనుని సేవకుఁడొకఁడు కానుపించి "అమ్మా! మీరొంటరులై వచ్చుచున్నారే" యని యడిగి యామెకు సాహాయ్యముగ వెంటనంటి వెళ్ళుచుండెను.

వసంతుఁడు నిద్రనుండి లేచి, కనకాంగిని గానక

యామె యెచ్చటి కేగెనో గ్రహించుట కాతఁ డీవలకు వచ్చి కొంతదూరమున వినవచ్చుచున్నమాటలసవ్వడి గ్రహించి చూచుచుండ, జయసేనుని సేవకుఁడు వెంటనంటియుండ కనకాంగి యింటివైపునకు వచ్చుచుండెను. కనకాంగి సేవకుని గాంచి "నీవింక వెళ్ళిపొమ్ము. నే నీక వెళ్ళఁగలనని" చెప్పి యామె గృహమునకు వెళ్ళెను. సేవకుఁడును దనయింటినిగూర్చి వెళ్ళిపోయెను. వసంతుఁడు తనభార్యకుఁ గనబడకుండ పరుగుపరుగున తనపడకగది కేగెను. కనకాంగి యింటికివచ్చి తనభర్తను జూచి యింకను నిద్రలేవలేదని తలపోసి తానుకూడ శయనించెను. వసంతుఁడు కొంతసేపునకు లేచి "నీ వెక్కడి కేగితి" వనెను.

కన—నే నెక్కడి కేగితిని?

వసం—"నిక్కము వక్కాణింపవా?" యని యాగ్రహముతో ననెను.

కన—నాకు ప్రతిదినమును దుస్స్వప్నములు వచ్చుచున్నవి. అందుచే పీడాపరిహారార్థము దేవిని ప్రార్థించుటకు దేవళమున కేగితిని.

వసం—అట్లయిన జయసేనుని సేవకుఁడు నిన్నెందులకు వెంబడింపవలయునో? కానిమ్ము.—

వసంతుఁ డాగది విడచి యావలకు వెళ్ళిపోయెను. కనకాంగి తనస్థితినిఁ దలంచుకొని గోలుగోలున నేడ్చుచుండెను.

"అయ్యో! నానాథుఁడు నాశీలమును గూర్చి యెన్నఁ

డును నన్నుమానపడ లేదు. ఇపు డేమికారణమునో నన్నన్యథా తలఁచుచున్నాఁడు. జయసేన నిపేరు చెప్పినంతమాత్రమున భగ్గున మండిపడును. దుర్మార్గు లెవరైన కుట్ర నేదైన పన్ని యుండరు గదా! నానాథుఁడు సరిగా భుజించుటలేదు. పరుండుట లేదు. నేనేమిచేసిన నన్నియు విపరీతములుగఁ గణించుచున్నవి. విధి బలవంతమైనపు డెవ రేమి చేయఁగలరు ?

— —

పదునేడవ ప్రకరణము.

కం. కాంతల నమ్మదు రే? ధీమంతు
లిసీ! సుతనులతలు మాయామృగముల్
హంతలు జగజంతలు నిసు
మంతయు లోకాపవాద మరియరు మనలోన్.

కదళీపతినాయకుని శుకసప్తతి.

వసంతున కేమియుఁ బ్రపంచము తెలియుట లేదు. ఆతనికి పూర్తిగా పిచ్చిపట్టినది. రాత్రిసంగతి యంతయు నాలోచించిన శరీర మాతనికి నీరగుచున్నది. ఆతఁడు తనలోఁ దా నిట్లు తలపోయఁదొడఁగెను.

"ఆహా! నేను నిద్రించుచుంటినా లేక స్వప్నావస్థయం దుంటినా? నా బ్రదు కిట్లగునని యెన్నఁడును తలంపనైతి నే? నా కనకాంగి యిట్లు మోసముచేయునని యించుకయును గ్రహింపఁజాలకపోయితి. ఆహా! స్త్రీల నెంతైన నమ్మవచ్చునే? ఎంతసాహసము! ఎంత దౌర్జన్యము. ప్రపంచమంతయు గజగజ

లాడింపఁగలిగిన సేనానాయకునిభార్యయైయుండి యీయామె యిట్టి దుర్మార్గ మొనర్పవచ్చునే? అయ్యో! నాపై నెంతయనురాగ మున్నట్లు నటింపుచువచ్చె. ఆమె నననేల? రాజకుటుంబములో నెవ్వరికైన నామెనిచ్చి పరిణయ మొనర్చుట కామెతండ్రి యత్నింప నే నామెకొఱ కాశఁ జెందవచ్చునే? కాఁబట్టియే నాకిట్టి యిక్కట్టు సంభవించినది. ప్రేమించి నిన్ను నాతల నిడుకొను నన్ను నీ విట్లు చేయుదువే?"

"హా! కనకాంగీ! నీవసంతుని నీ వట్లవమానపఱుతువే? ఆనాఁడు నీవు నీతండ్రిగృహమును విడిచి వచ్చినపు డుద్యాన వనమున నాడినమాట లంతలో మఱచితివే? నీవు సద్గుణురాల వనుకొంటిని గాని యిట్టి తుచ్ఛురాలవని తలంపకపోతిని."

"అక్కటా! నేనెంతయదృష్టహీనుండను. ఎట్టిచిత్రములఁ గనుచుంటిని. కనకాంగి—నీతండ్రి నిన్ను క్రూరసేనున కిచ్చి వివాహము చేయనెంచ వలదని నా చేఁబట్టలేదా? ఆనా డుద్యానవనమున నన్ను గానక "అయ్యో! నాప్రాప్తి కేమందును? ఎంత వెదకినను గానకున్నా" యని విలపింపలేదా? అపుడు నే నచట కానుపింప మోహాతిరేకముతో నిహస్తయుగ్మము నా మెడకు మెలివేసి, "హా! నాథా" యని మూర్ఛపోలేదా? నాఁడు ప్రయాణమం దొకనదియొద్దనుండ నీతండ్రిచేఁ బంపఁబడిన యశ్వారూఢులను గాంచి "మిత్రమా! మన యాశలన్నియు నడుగంటెన" వని మొఱ్ఱ మూర్ఛపోలేదా? నీతండ్రిచే రాజసభాస్థలికి మన మీడ్వఁబడినపుడు రాజు

నిన్న ప్రశ్నింప "తండ్రీ! మమ్ము క్షమింపుము వసంతునియం దించుకయు దోషము లేదు. ఆతని చరిత్రలన్నియు విన నాతని యందు నా కనురాగ ముద్భవించినది. నే నన్యుల వివాహ మాడఁజాల. ఆతఁడే నా దైవ"మని చెప్పలేదా? నాడు నేను శత్రురాజులపై యుద్ధమున కేగునపుడు నీవు నన్ను బాయఁ జాలని కారణమున నే నొంటరినై యుండఁజాలనని చెప్పి నా వెంట రాలేదా? అట్టి కనకాంగి కిట్టిదుర్మార్గమా!"

"నమ్మఁజాల—నమ్మఁజాల—నమ్మకున్న నిన్నటిరాత్రి వృత్తాంతమున కేమనవలయు. ఈచేరుమాలునకును నిందున్న జాబునకును నేమనవలయు? (ఉత్తరమును చదువుకొనుచు) "జయసేనా! నీవే నా దైవమవు?" ఏమి ఇది యీమె వ్రాత గానట్లు దోఁచుచున్నది. ఏదుర్మార్గులయిన నిట్టి జాబును సృజించియుండరుగదా! కాకున్న నాకనకాంగి యిట్లొనర్చునే? కనకాంగి పరమపతివ్రత. ఆమెయం దిట్టిదోష ముండునే? నాకనకాంగి సుగుణరాసియే! ఆమె సత్స్వభావమునకు నిలయమే! ఆలోచించిచూడ నామె, దైవము సద్గుణముల నన్నింటిని నొకచోఁ జేర్చి యేర్పరుపఁబడిన దేవతావిగ్రహముకాదా

"ఆహా! నా కిట్టిమగులు—ఆమెయందు నాకున్న ప్రేమాతిశయంబున లేనికారణములఁ గల్పించుకొని యామె పతివ్రతయని యానందించుచున్నాను. ఇది సరియైనయోచనయే! ఆమె దుష్ప్రవర్తనురాలు గాకున్న నిట్టిదృష్టాంతము లెట్లు లభ్యమగును. ఇంతయేల. జయసేనుని నాభర్త యాగ్రహమునుండి యెట్లు కాపాడఁగలనో యని యామె నమ్రదతో ననుచుండలేదా? వేరుదృష్టాంత మేమి కావలయు. నిన్నటిరేయి నేను గాంచినది చాలదా?"

జయసేనా! ఎంతపని చేసితివి? పరమమిత్రునివలె మెలఁగుచు నీవిట్టిదుర్మార్గ మొనర్పవచ్చునే?

హా! హా! భరింపఁజాల భగవంతుఁడు నాకిక్కటులు గలిగింప నెన్నిమార్గము లుండలేదు. అగ్నిగుండంబుల నన్ను పారవేసినను వెరువను. అతితీవ్రమగు కాలాహులచేఁ గఱపించినను దుఃఖింపను. నాకుఁ దిండిలేకుండఁ జేసి సజీవునిగా దహింపఁ జేసినను విచారింపను.

ఇప్పుడా! నాపంచప్రాణంబుల నెవరికై యర్పించియుంటినో! అట్టికనకాంగి నన్నుగాక యితరునితోనుండ నేను భరింపఁగలనే? జయసేనా! ఇంక నీవుండవు. కనకాంగీ!—మరణమునకు సంసిద్ధవై యుండుము"

అనివసంతుఁడు మూర్ఛబోవును.

పదునెనిమిదవప్రకరణము.

కం "ఆపప్పును పరమాన్నము
ఆపూర్ణపు బూరె గారె లన్నియుఁ దినఁగన్
నాపొట్టపట్టదాయెను
నాపొట్టకుఁ దోడ పొట్ట యింకొకటేదీ॥
శత్రురాజులపైఁ గలిగినజయముకై జయంతుఁడు

మిగుల సంతసించి తనరాజ్యమందున్నజనుల కందఱకును సంతర్పణము చేయ నిశ్చయించుకొనెను. జాతిభేదములతో నందఱికిని భోజనపుటేర్పాటులు చేయించెను. భోజనమునకుఁ బూర్వము చాలమందికి కానుక లిచ్చెను. వసంతుఁ డచ్చటి కేగెను. కాని యాతనికి దేహమునందస్వస్థతగా నుండుటచే నాతఁ డుత్సాహముగ నుండలేదు.

ఆనాడు బ్రాహ్మణుల కందఱికిని బెండలకడనే భోజనపుటేర్పాటులు జరిగెను. నవగాయపిండివంటలును తయారుచేయఁబడెను. ప్రత్యక్షపు విఘ్నేశ్వరులో యన బొజ్జబ్రాహ్మణులు తమపొట్టలను సవరించుకొనిరి. కొందరు పనసలు చెప్పుచుండిరి. కొందఱుశ్లోకములుచదువుచుండిరి. తమబ్రాహ్మణత్వమును జూపుటకుగొందఱుముఖములనిండనట్టముగగంధాక్షతలనుంచుకొనుచుండిరి. వేదఘోషలతోపందిరియంతయు మ్రోయుచుండెను. కొందఱుస్వహస్తపాకులువంటశాలలయొద్దకుబరువెత్తి వంటబ్రాహ్మణునితో, "అయ్యా! నేను స్నానముచేసి వచ్చెదను. గిన్నెతో నీళ్ళను పొయిమీఁద నుంచిపెట్టుమని చెప్పెను. ఆవంటబ్రాహ్మణుఁ డట్లుచేసెను. స్వహస్తపాకి యాజ్ఞచొప్పుననే బియ్యముగూడ వంటబ్రాహ్మణుఁడే పోసెను. కొద్దికాలములో నవి యుడుకుటచే వంటబ్రాహ్మణుఁడు స్వహస్తపాకిని గిన్నెను దింపుకొనుమని తొందరచేసెను. గాడిమంట తీవ్రముగ నుంటచే గాడివద్దకాకపటస్వహస్తపాకి వెళ్ళలేకపోయియావంటబ్రాహ్మణుని గిన్నె దింపిపెట్టమని బ్రతిమాలెను.

ఓకపటస్వహస్తపాకులారా! గొప్పకై తలకుఁ దగని మొత్తుల నెత్తుకుఁడు.

బ్రాహ్మణులందఱు భోజనమునకుఁ గూర్చుండి పిండివంటలతో హాయిగా మెక్కుచుండిరి." ఇంటికి వెళ్ళినతరువాత మిఠాయికావలె ననెదరు బాగుగ తినుఁడని పెద్దలు తమపిల్లలను హెచ్చరించుచుండిరి. రోజునుండెడి పప్పు, అన్నమున కేమి యని కొందఱు పిండివంటలపైఁ బట్టించుచుండిరి. మధ్యమధ్యమున బ్రాహ్మణులు శ్లోకములఁ జదివి "భోజనకాలే గోవింద నామస్మరణ గోవిందా "యని గొప్పధ్వనులం జేయుచుండిరి. బ్రాహ్మణులును వడ్డనబ్రాహ్మణులు నతివిచిత్రముగా మాట్లాడఁజొచ్చిరి.

1 వ బ్రా:—సుబ్బావధాన్లు - యేమెక్కివచ్చావోయి, బహుతొందరగా వచ్చావు.

2 వ బ్రా:—తాతగారు! ప్రొద్దెక్కి వచ్చానండి.

1 వ బ్రా:—ఇదేమిటోయి-ప్రొద్దెక్కటమేమిటోయి- బహుచిత్రముగా నున్నది.

2 వ బ్రా:—ప్రొద్దెక్కినతరువాత బయలుదేరి వచ్చినానండీ-తాతగారు.

3 వ బ్రాహ్మణునికొడుకు నాన్నగారు బూర్లోకిపూరణము ఏలావచ్చిందండీ.

3 వ బ్రా:—తరువాతచెప్పెదను తినరా.

4 వ బ్రా:—గుమ్మడికాయకూర మంచిపాకాన్ని పడ్డదండీ

అబ్బాయి-గుమ్మడికాయ పుచ్చుకోవయ్యా.

వడ్డనబాలుఁడు:—లేవండి.

4 వ బ్రా:—గుమ్మడికాయకూర అయిపోయినదా?

వ, బ్రా:—కూర ఉన్నది-కాయ లేదు.

ఈ వింతమాటలకు ప్రజలందరును నవ్వుచుండిరి. ఒకరికన్న నొకరు తమవాక్చమత్కృతినిఁ జూపించుటకుఁ బగినప్రయత్నంబులఁ జేయుచుండిరి.

ఇట్లుండ వడ్డనబాలుఁ డొకఁడొక్కఁడి కేగి యొక బ్రాహ్మణుని అయ్యా! రెండుబూర్లు వేయించుకొండని కోరెను. అందున కాయన "అబ్బాయి, పొట్ట ఖాళీ లేదోయి" యనెను. కొంతసేపున కాబాలుఁడే మిఠాయి తీసుకొనివచ్చెను అప్పుడాబ్రాహ్మణుఁడు "అబ్బాయి-నాలుగుండలు వేయు" మనెను. అందుల కాబాలుఁడు "అయ్యా! తమరిదివరలో కడుపు ఖాళీ లేదన్నారే? మిఠాయి యేలతినెదరు" అనియడిగెను. అందుల కాబ్రాహ్మణుఁడు "మిఠాయితిత్తి వేరయ్యా" యనెను

ఈ విధముగ రంగమంతయు నతిసంతోషముగ నుండెను. మిఠాయి మొదలగు తీపిపదార్థములను, ఆవపిండి మొదలగు కారపు వస్తువులతో కలిపి తినుచుండిరి. ఇట్లు బ్రాహ్మణసంతర్పణ ముగిసెను.

రాజబంధువులకును ఉద్యోగస్థులకును రాత్రివిందేర్పరుపఁబడెను. అందరు విందున కేగిరి. యేమికారణముననో, క్రూరసేన దుష్టబుద్ధులు విందుకు రాలేదు. అస్వస్థతచే వసం

తుఁడు విందునకు రాఁజాలనని వర్తమాన మంపెను.

భోజన మగునప్పటికి రాత్రిమిగుల ప్రొద్దుపోయెను. భోజనానంతరమున జయసేను డొంటరియై తన గృహమున కేగుచుండెను. మార్గమధ్యము నిర్మానుష్యమై యుండెను. ఈతడొక సందుమార్గమును బట్టిపోవుచుండ నెవఁడో యాతనిపై కురికి యాతనకి గాయము జేసెను. అంతలో జయసేనుఁడాతని హస్తమునన్నున్న ఖడ్గమును లాగుచుండ వెనుకనుండి యింకొక క్రొత్తపురుషుఁడు మెరుపువలెఁ గానుపించి తనయెదుటనున్న మనుజుల నిద్దరిని తనకరవాలముచే నేసెను. జయసేనుని కెక్కువగ గాయములు తాకెను. కాని ప్రాణభయముమాత్రము లేదు. రెండవవాఁడు మృతినొందెను.

ఒకటిరెండు మనుజు లెవరో చెప్పనక్కర లేకనే చదువరులు గ్రహింతురుగాక!

కొంతసేపునకారెండవవాఁడు జయసేనుని వద్దకుఁబరువెత్తివచ్చి "ఎవరచ్చట? అంత దీనతతోఁ గూయుచుటకుఁగారణంబేమి?" యని కేక వేసెను. అందులకు జయసేనుఁడు "మిత్రమా! దుష్టబుద్ధి! నన్నెవరో గాయపరచిరి. నన్ను రక్షింపుము. తుదకు నాయవస్థ యిట్లు వచ్చినదని విలపింపసాగెను. అందుల కాదుష్టబుద్ధి "అయ్యో! నిక్కిట్టదుస్థితి యేల ప్రాప్తమైన"దని యనుచు జయసేనుఁడు చనిపోయెనని తలచుచు వచ్చుచున్న దుష్టబుద్ధి యాతఁడింకను మృతినొందలేదని మిగుల విచారించుచుండెను.

— —

—: పందొమ్మిదవ ప్రకరణము :—

తే॥ గీ॥ బ్రదికియున్నంతవఱకును భర్తృసేవ।
సలుపఁ గలిగినవారుండ్రి చాలమంది।
చచ్చియుంగూడ భర్తకీసరణిసేవ।
యొనరుపంజాలు సతు లిల నుండబోరు॥

చింతామణి.

పలురంగులద్వీపము లోకగదియందు వెలుఁగుచు నాగదిని భూతలస్వర్గముగఁ జేయుచుండెను. ఆగదికన్నిప్రక్కలను నిలువుటద్దములును విచిత్రపుబొమ్మలును గలవు. అందు మధ్యభాగమున హంసతూలికాతల్ప మొకటి కలదు. దానిపై నొకకాంత నిదురించుచుండెను. ఆమె యేమికారణముననో మిగుల వాడియున్నది. మధ్యమధ్య పలువరించుచు లేచుచున్నది.

ఇంతలో వసంతుఁ డచ్చటికి వచ్చి ద్వారముచెంత నిలువఁబడి యుండెను. ఆయువతి దిగ్గున లేచి యాతని కెదు రేగి, "వచ్చి పరుండు" డనెను. అందుల కాతఁడు నేను "జయసేనునికాను."

‟అయ్యో! జయసేనుఁడెవరికిఁ గావలయు? నాథా యిట్టి విపరీతపుమాట లాడెద రేల?,,

‟ఈదినమున నిష్టదైవమును ప్రార్థించి సంసిద్ధవై యుండుము.,,

‟ఎందులకు,,

‟మరణమునకు.,,

‟నే నేమినేరము చేసితిని?,,

‟చేయలేదా! ఇంకను నేమిచేసితి నని యడుగుచుంటివా?

‟నే నేమిచేసితినో చెప్పరాదా?,,

‟నాజేబురుమా లెవరి కిచ్చితివి?,,

‟నే నెవరి కిచ్చితిని?

‟ఛీ!దుర్మార్గురాలా!జయసేనున కీయలేదా!

‟అయ్యో! నే నేమియు నెరుఁగనే? —అతని బిలిపించి యడుగుఁడు.

‟ఆతఁ డెక్కడ నున్నాడు?,,

‟అయ్యో! ఆతనిఁ జంపిచితిరా!,,

‟చావనున్ననీ కింకను నాతనిపై ననురాగము పోవలేదా!,,

‟నాథా! నాశీలమింకను మీరు గ్రహింపలేదా?,,

‟గ్రహించితిని. కావున నే—మరణమునకు సిద్ధముకమ్ము.,,

‟నాథా! నన్ను రక్షింపుము.,,

‟నిన్నా—రక్షించుట—భక్షించెదనులే."

‟నాథా! నన్నే భక్షించెదరా? నాపై నింకను మీకు దయ లేదా?

‟నీవు చచ్చినవెనుక వచ్చునేమో?,,

„అపుడైన వచ్చిన నేను ధన్యురాలనే!

„చచ్చుటకు సంసిద్ధవై యుండుము.,,

„ఈదినము గడ విమ్మా.,,

„ఇచ్చుటకు వీలు లేదు.,,

అని వసంతుఁ డామెపైఁబడి „దుర్మార్గురాలా! ఎంతపని చేసితివే?,, యని కంఠము నులిమివేయుచుండ „హా! నాథా! ప్రేమాతిశయమున నామెడపై వేయుహస్తము లీనాఁడు నాకంఠము నెట్లు నులిమివేయుచున్న వనియేడ్చి మూర్ఛఁబోయెను.

వసంతుఁడు కనకాంగినిఁ జంప నున్నాఁడను చరిత్రి జయంతుఁడు గ్రహించి యచ్చటికి రాజభటులతో వచ్చెను. జయంతుఁడు కనకాంగి మరణమునకు మిగుల విచారించి తన భటులకు వసంతుని బట్టుట కాజ్ఞ నిచ్చెను. వెంటనే రాజభటు లాతని సంకెళ్ళనుంచిరి. కనకాంగి కన్నులు విప్పి చూచి „నానాథుఁడు నన్ను చంపలే”దని చెప్పి కన్నులను మూసెను.

జయంతుఁడు కనకాంగియొక్క కడపటిమాటలకు నిశ్చేష్టుఁడై తనలో దా నిట్లనుకొనెను. „ఆహా! ఏమి! ఈకాంతయొక్క శీలము. తననాథుఁడు తన్ను వధించినను యాతనిఁ గాపాడుటకు తనభర్త తన్ను జంపలే దనుచున్నది. ఇట్టిపతివ్రతాతిలకము లెచటనైన నుందురే.,,

„ఛీ!దుర్మార్గా! ఎంతపని చేసితివి? ఈసుగుణరాశినిఁ జంపుటకు నీకెట్లు చేతు లాడెను. అట్టిసాధ్వినిఁ జంపినపాపఫల మిప్పుడే యనుభవింతువు గాక.” యని తనభటులతో “వీని

నిప్పుడే పట్టి నాయొద్దకుఁ దీసికొనిరం,, డని యాజ్ఞ యిచ్చి యాతఁడు వెళ్ళిపోయెను.

నర్మద లోనికి వచ్చి వసంతునిగాంచి, „ఇదేమి? ఈమ స్థితి నీకేలవచ్చిన” దనెను.

ఇంతలో “అయ్యో! చచ్చుచున్నాను.” అనుధ్వని వినవచ్చెను. ఆధ్వని విని నర్మద లోనికేగి కనకాంగినిఁ జూచి „అయ్యో! నాప్రాణసఖి యిట్లున్న దేమి?,, అనెను.

„నర్మదా! అంతయు నెఱిఁగి నన్నేల ప్రశ్నించెదవు?”

„వసంతా! ఆమె యందించుకయును దోషమేమియు లేదే?,,

„లేకున్న నాచేరుమాలు జయసేనున కెట్లు వచ్చెను.,,

„అయ్యో! ఎంతమోసము వాటిల్లె. నాభర్త యాజ్ఞ చొప్పున దానిని నేను కనకాంగియొద్దనుండి యామె కెరుక లేకుండ గ్రహించి యాతని కిచ్చితిని.,,

„అట్లయిన నామె జయసేనున కీయలేదా? అయ్యో! యెంతమోసము వాటిల్లె?,,

ఇంతలో నొకసేవకుఁడు ప్రవేశించి, „అయ్యా! నేను జయపురమును గూర్చి వెళ్ళుచుంటిని. మార్గమధ్యమున నాకొకవృద్ధుఁడు గానుపించెను. ఆతఁడు కడు యోగ్యుఁడువలె నున్నాఁడు. ఆతని కొకజాబిచ్చి దుష్టబుద్ధి క్రూరసేనునియొద్దకుంబంపుచుండెనఁట. ఆతఁడేమికారణముననో, „దుష్టబుద్ధిసేవ నేను చేయఁజాలను. ఎంతకాల మిట్టిఘాతుకకర్మంబులఁ జేయఁ

గలను. కాటికిఁగాళ్ళు సాచి యున్న నన్ను కూడ నిట్టిదుర్మార్గములకు నియమింపవలెనా? వసంతున కీజాబు నందఁజేసెదనని చెప్పుచు నావెంట వచ్చె,, నని యాముదుసలిని వసంతు నెదుట నిలిపెను. ఆముదుసలి వసంతునిఁ గాంచఁగనే తనచేనున్న చీటీ నాతని కిచ్చి "అయ్యా! ఈజాబు గాంచినచో నాదుర్మార్గుని దౌర్జన్యమంతయుఁ దేటతెల్ల మగును.,, అనెను

వసంతుఁడు మనస్థిమితము లేకయుంటచే నాసేవకుని జాబును చదువు మనెను. సేవకుఁడు జాబు విప్పి చదివెను.

"మిత్రుఁడగు క్రూరసేనునకు దుష్టబుద్ధి వ్రాయునది."

"మిత్రమా! నీవు వ్రాసినజాబు చేరినది. అందుల సంగతులు గ్రహించితిని. నేను నీసంగతి నాలోచించుట లేదని నీ యభిప్రాయము. జయసేనుఁడు నిష్కపటుఁడైనను— కనకాంగి పరమపతివ్రతయైనప్పటికిని—

"వసం:—దుర్మార్గా! యెంతపని చేసితివి! జయసేనకనకాంగులపై దోషారోపణ చేసితివా?

"సేవ:—మనకోరిక సఫలము చేసికొనుట కనేక కుట్రలు పన్నితిని. వసంతునికి మిత్రునిగనుండి యాతనికిని గనకాంగికిని వైరము గల్పించితిని. జయసేనునిఁ జంపుటకుఁ బ్రయత్నించుచున్నాఁడ. కొద్దిదినములలో మనకార్యము సఫలమగును. నీతో మాట్లాడుపని యున్నది. కాన నీవొకసారి రమ్ము.

ఇట్లు మిత్రుఁడు—దుష్టబుద్ధి.,,

"అరే! దుర్మార్గా! దుష్టబుద్ధీ! ఎంతపని చేసితివిరా,,

యని వసంతుఁడు మూర్ఛఁబోయెను. రాజభటులును రాజున కీసంగతి యంతయుఁ దెలియపఱుప "వసంతుని వదలివేసి దుష్టబుద్ధిని పట్టుఁడని యాజ్ఞయిచ్చెను.

కొంత సేపటికి వసంతుఁడు మూర్ఛదేఱి "ఆహా! నేఘోర పాపుఁడ గదా! నన్నే దైవముగఁ దలంచు కాంతను నిష్కారణముగఁ జంపితిని. నా యట్టి పరమపాపి యెందైనఁగలఁడే కాంతా! నిన్ను నిష్కారణముగఁ జంపుకొంటిని. కాన నేనుకూడ నిన్ను వెంబడించుచున్నాను. నీవు గతించిన నాకింక దిక్కెవరు?" అని యనుకొనుచుండెను.

"ఓరీ! దుర్మతీ! స్నేహితునివిధంబున మెలంగుచు నెంతపని గావించితివి. పాపము! జయసేనకనకాంగుల విషయమై యిట్లొనర్చుటకు వారు నిన్నేమి చేసిరి. నీకుఁ బాపభీతి లేదా?

—:ఉపసంహార ప్రకరణము:—

గీ॥ బడిశలగ్నమత్స్యంబు చేపలకు మొదట
సంతసమునించి పిదపఁ గష్టంబుఁ గూర్చు
కరణి పురుషుని దౌర్జన్యసరణి మొదట
సుఖముగానుండి యటుమీఁదఁ జూపు వ్యథను॥

జయసేనుఁడు రాజ్యమందు యుద్ధవ్యవహారములందు నెక్కుడుగ పాటుపడినవాఁడగుటచే రాజతనిస్థితిని బాగుగ విచారించి రాజ్యవైద్యుల బిలిపించి మందుల నిప్పించుచుండెను. ఆతఁ డారోజున కాలో నారోగ్యవంతుఁ డాయెను.

జయసేనుని భార్య తనభర్తకుఁ గలిగిన యాపదకు మిగుల విచారించుచుండెను. కొంతసేపునకుఁ గనకాంగిని దలఁచి “కనకాంగీ! ఎట్టిదుర్మార్గమున కొడిగట్టితివి. పచ్చని నా కాపురము మంటఁగలుప యత్నించితివా!” యని విచారించుచుండ నర్మద యచ్చటి కేతెంచి జయసేనునికిఁ గలిగిన దుస్థితి కామె నోదార్ప కళావతీ కనకాంగి యెట్టిదుష్కృత్య మొనర్చినదో చూచితివా? నా భర్త నామె స్వాధీనముఁ జేసికొని నా కాపురము మంటఁగలుప యత్నించిన దనెను. అందునకు నర్మద, “కనకాంగిచరిత్ర నీ వెఱింగియు నిట్లనెద వేల? ఎవరో దుర్మార్గు లిట్టికుట్రను పన్నిరి. కాని వేఱొండు కాదు. పాపము! వసంతుఁ డామెశీలము ననుమానపడి యామెను వధించెను.”

కనకాంగికిఁ గలిగిన దుస్థితికి కళావతి మిగుల విచారించుచుండెను. పతివ్రతా శిరోమణియగు కనకాంగి నట్టి దుర్భాషలాడినందున నామె కడువగచుచుండెను. జయసేనుఁడు కనకాంగి చరిత్రనంతయు తనభార్యవలన గ్రహించి “అయ్యో! నే ఘోరపాపుఁడనుగదా! నాకీదురవస్థ రాఁదగినదే? నావలన నా పతివ్రతాశిరోమణి తనప్రాణంబులఁ గోలుపోయెనే?” యనివిచారించుచుండెను.

ఇట్లుండ వైద్యుఁ డచ్చటి కేతెంచి కట్లు విప్పి చూచెను. కాలుసరిగా నతుకుకొనలేదు. ఇంకను సరిగా బాగుపడుట కథమపక్షము రెండుమాసములు పట్టునని వైద్యుఁడు తలఁచుచుండెను. కనకాంగి చరిత్ర యాతని కెల్లపుడును మనసున

మెసఁగుచుండుటచే నాతనివ్యాధి యధికమగుచుండెను. కాని తగిన వైద్యుఁడు చికిత్స యొనర్చుచుండుటచే వ్యాధి యంతగా ప్రబలుట లేదు.

నర్మద కనకాంగి కించుక ప్రాణమున్నదని తలపోసి యామె నొక రహస్యగృహమందుంచి కాపాడుచుఁ దగిన చికిత్స గావించుచుండెను. కనకాంగి సజీవయై యున్న సంగతి నర్మదకుఁ దక్క తదితరులకుఁ దెలియదు. నర్మద తనభర్తయగు దుష్టబుద్ధి చేసిన కుట్రలకుఁ గడుఁ గుందుచు నాతనియందు నసూయ గలిగి యుండెను.

ఇట్లుండఁ గొంతకాలమున రాజపుత్రస్థానమున గొప్ప యల్లరులు జరుగుచుండెను. చిన్నపల్లెలు తగులఁబెట్టబడుచుండెను. దొంగలనాయకుఁడు గ్రామములపైఁ బడి కొల్లగొట్టుచుండెను. తుట్టతుదకు దొంగలనాయకుఁడు రాజధానికి వెళ్లెను.

దుష్టబుద్ధి చేసిన కుట్రలన్నియు రాజునకుఁ దెలియుటచే నాతని దండింపఁ బ్రయత్నించి చిట్టచివరకు నుద్యోగభ్రష్టుని గావించెను. తాను మిగుల నీచావస్థ నుంటచే, తాను వ్రాసిన జాబుచొప్పున కపాలికున కేసాహాయ్యమును చేయఁ జాలకపోయెను. అందుల కా దోపిడినాయకుఁడు దుష్టబుద్ధి తన్ను వంచింపదలఁచి యట్టిజాబు వ్రాసియుండెనని తలఁచి దుష్టబుద్ధి యింటిపైఁబడి దాఁచినంతయు కొల్లగొట్టెను. తనకు గలిగినదుస్థితిని జెప్పుట కాతఁడెంత ప్రయత్నించినను, కపాలకుఁ డాతనిమాటలు పెడచెవిని బెట్టి యాతని ఖైదీగాఁ దీసికొనిపోయెను.

దౌర్జన్యము మొదట జయముగ నున్నట్లు కానుపించినను, కడకు దానిఫలితము దానికిందగినట్లేయుండును. దుష్టబుద్ధి చేసిన దుష్కృత్యము లూరకపోవునా! ప్రాణపదంబుగఁ దలపోయుచున్న వసంతునిచే సాధ్వియగు కనకాంగిని జంపింప నెంచిన పాపఫల మూరకపోవునా! తననే ప్రాణమిత్రునిగఁ దలపోయుచున్న జయసేనునికిఁ గల్పించిన యిక్కట్టుల ఫలిత మేమగును?

నర్మద తనభర్త యొక్క దుష్కృత్యమును గనులారఁ జూచియుండినదగుటచే నామె తనభర్తకై విలపింపక తనభర్తచే వంచింపఁబడినవారి కుపకార మొనర్చుచుఁ దనమూలమునఁ దనభర్తకు ముక్తిమార్గముకై ప్రయత్నించుచుండెను.

—:ఇరువదియొకటవ ప్రకరణము:—

దుష్టబుద్ధిని నేను దున్మి వేస్తాన్।
క్రూరసేనుని నేను కూల్చి వేస్తాన్॥

రాజపుత్రస్థానము నం దొకపట్టణమున నొక సత్రము కలదు. అందుదఱుచు బాటసారులు, గోసాయిలు, బిచ్చగాండ్రు మొదలగు వారందఱు నచ్చటికిఁ జేగుచుందురు. అందు భోజనపు టేర్పాటుకూడఁ గలదు. ఆసత్రపు యజమాని భోజనపు టేర్పాటుల నిమిత్త మొకగుమస్తా నుంచెను. అతఁడు ప్రతిదినమును జనులనుజూచి వారికి భోజనములఁ బెట్టించుచుం

డును. బీదసాదలందఱు నచ్చటికేగి భోజనముఁ జేయుచు నచ్చటనే పరుండియుందురు.

వసంతునకు భార్యసంగతి యంతయు, దుష్టబుద్ధి క్రూరసేనునకు వ్రాసిన జాబుచేతను నర్మద కనకాంగియందించుకయును దోషములేదని చెప్పుటచేతను గ్రహించి, యామెను నిష్కారణముగఁ జంపుకొనినందుకు విచారించుచు పిచ్చవానివలె తిరుగుచుండెను. దిరుగు టేమి? నిశ్చయముగఁ నాతనికి బిచ్చయే పట్టెను. అట్టిసాధ్వీమణిని దన చేతులారఁ జంపుకొనినపుడు పిచ్చయెత్తుటాశ్చర్యమా! ఎల్లపుడును కనకాంగి స్మరణ తప్ప వేఱొండు లేదు. ఒకసారినవ్వును. ఇంకొకసారి యేడ్చును. పరువెత్తును. ఇట్లున్మాదముచే బాధపడుచుండ జయంతుఁడీతని స్థితికి మిగుల విచారించి యీతనికిఁ జికిత్స చేయఁ బ్రయత్నించెను. కాని యేమియు లాభములేకపోయెను. కనకాంగినిఁ జూచిన గాని యాతని కాపిచ్చ వదలదు.

ముందు చెప్పఁబడిన సత్రమునం దిరువురు పిచ్చవాండ్రు కూర్చుండియుండి వారిలోవారు సంబంధములేని మాటలు మాట్లాడుకొనుచుండిరి. అందులో నొకఁడు మాత్రము మధ్యమధ్యమున నప్పుడప్పుడు కనకాంగికై విలపించుచు దుష్టబుద్ధిని దూషించుచు—

"దుష్టబుద్ధిని నేను దున్మి వేస్తాన్।
క్రూరసేనుని నేను కూల్చి వేస్తాన్॥"

అని పాడుచుండును. వారుభయులు నచ్చటఁబరుండి

యుండిరి. వారిలో నొకఁడు రెండవవాని తలను గోకెను.

1 వ పి—నా తలగోకుతా వేమిటిరా?

2 వ పి—నీతల యేమిటి? నాకుమాత్రం లేదా?

1 వ పి—నీకు తలవుంటే నాది గోకుతా వేమిటి?

2 వ పి—నా తల గోక్కున్నాను. నీతల గోకినానా?

(అని మరల గోకెను.)

1 వ పి—అది నాతల నీతల కాదు.

2 వ పి—అవుతే నాతల యెక్కడుంది.

2 వ పి—నాకనకాంగి నెవరు చంపినారు? దుష్టబుద్ధి చేసినాఁడు. వాడికొంప నట్టేట్లో కట్టాలి. క్రూరసేనునికి బాగా మంగళం పెట్టాలి. వెర్రివాణ్ణో తేమాత్రం నాకు తెలియదూ? నాకు రెక్కలుంటే యెగిరివెళ్ళి దుష్టబుద్ధిని నాశనము చేయనా? నాకు తెక్కలేకేమి? ఎగిరిచూస్తా అయ్యో! పడిపోయినాను. చేటలు కట్టుగుంటా! ఏనుక్కి పెద్ద రెక్కలు పెట్టాడు. కాక్కి చిన్న రెక్కలుపెట్టాడు. పెద్ద రెక్కలి దస్తమానం ఎగురుతుంది. చిన్న తెక్కలిది కొంచంసే పెగురుతుంది.

1 వ పి—అలాగైతే ఏనుగుకొంచంసే పెగురుతుందా?

2 వ పి—ఎగరకేమి? పగలుకూడా యెగిరితే మనుష్యులమీద పడుతుందని రాత్రియెగురుతుంది.

1 వ పి—ఏనుక్కన్న పెద్దవిగదా కొండలు వాటికి రెక్కలుండేవిగదా! అవి యెవరిమీద పడలేదేం?

2 వ పి—ఆలా పడతాయనే యించేత నే వాటి తెక్కలను తెగ్గొట్టాడు.

వారిట్లు మాట్లాడుకొనుచు నవ్వుచు నవ్వుచుఁ గొంత సేపునకు నిదురఁబోయిరి.

—♦—

—:ఇరువది రెండవ ప్రకరణము:—

గీ॥ కాలవశమునఁ గల్గిన గష్టచయము
లెల్ల వెంటనె నిలుచునే యేకరీతి।
మిహిరమండలమునుగప్పు మేఘపటలి
తూలిపోకుండునే యెల్ల కాలమట్టు॥

హరిశ్చంద్రీయం.

ఒకనా డర్ధరాత్రిమున నొకకాంత తనముందు నొక శవమునిడుకొని, "అయ్యో! నాప్రయత్నము లన్నియు భగ్నమాయెనే? నాభర్తచేఁ బంధవింపఁబడిన కనకాంగికిఁ బ్రాణరక్షణ మొనర్చి యాపెను భర్తతోఁ జేర్పఁ బ్రయత్నించుచుంటిని. నా కోరిక సఫలమగునట్లు లేదు. ఎట్లు నే నీమెనుగాపాడఁగల నని విలపించుచుండఁ బరుండి యున్నయా నెలఁత శరీరము కొంచెము కదలఁజొచ్చెను. అపుడాయువిద, "ఆహా! నేనెంత యదృష్టవంతురాలను. ఈమెకు జీవ మున్నట్లు తోఁచుచున్నయది. కావునఁ జికిత్సఁ గావించెద"నని తిరుగ మందుల నిచ్చుచుండెను.

ఇట్లుండఁ గొంత సేపున కాయువతి తెప్పిరిలి "అయ్యో! నా నాథుఁ డేమాయెనో! అతని కేమిపాట్లు వచ్చినవో" యని

విలపింపసాగెను. నర్మద కనకాంగికిఁ దగిన చికిత్స నొనర్పుటచేఁ గొంచెముకాలములోనే యారోగ్యవంతురాలాయెను. కనకాంగి తనభర్త యున్మాదస్థుం డున్నాఁడని నర్మదవలనఁ దెలిసికొని మిగుల విచారించుచుండెను. తనభర్త సుగుణవంతుఁడని యామె పూర్ణముగా నెఱుఁగును. నర్మదను దనభర్తను నెట్లయిన దీసికొనివచ్చి చూపుమని యామె ను బ్రతిమాలుచుండెను.

నర్మద కనకాంగి మాటచొప్పున నీపిచ్చివాఁడున్న సత్రమునొద్ద కేగి, 'వసంతా! నీవు భోజనము చేసినావా? నీకీ చిరుగుపాత లేల? నా యింటికి రమ్ము. నీకుఁ బెండ్లిచేసెద" ననెను. అందులకాతండు ఫక్కున నవ్వి,

"దుష్టబుద్ధిని నేను దున్ని వేస్తాన్!
కూరసేనుని నేను కూల్చి వేస్తాన్॥"

అనిపాడుచు నెగిరి గంతులు వేయుచు "దుష్టబుద్ధి నాకు పెళ్లిచేశాఁడు. నేను వాడికి మళ్ళీ పెళ్లిచేయిస్తాను." అనెను. వసంతునిమాటలు విని యాతనిస్థితికి నర్మద విచారించుచుండెను.

కొంతసేపైనతరువాత నర్మద యొకపటమును దీసి వసంతునకుఁ జూపించెను. ఆతం డాపటమును జూచి "యిది నా కనకాంగి" యని వెఱ్ఱికేకలిడుచు నేడ్వసాగెను. నర్మద వసంతుని దనగృహమునకుం దీసికొనిపోయి కనకాంగి నాతనికిఁ జూపింప నాతఁడు వెఱ్ఱిచూపులనిగిడ్చియుండఁ గనకాంగి దుఃఖము నాపుకొనలేక యాతనిబట్టుకొని, "నాథా! యిప్పుడైన నాశీలమును గ్రహించితిరా?" యనిగోలుగోలున నేడ్చుచు,

"అయ్యో! నానాథుఁడెంత మారిపోయినాఁడు. నా పాడుకండ్లీనాఁడీతని నిట్టిదుస్థితియందు జూడనయ్యెనుగదా" యని విలపించుచుండెను. వసంతుఁ డేమియు మాటాడఁజాలక రాయివలె నుండెను.

వసంతునకుఁ గనకాంగిని జూచినంతనే యున్మాదము తగ్గ మొదలుపెట్టెను. ఆతండు తనభార్యను దగ్గరకుఁ జేర్చుకొని "నాయట్టిపరమపాపి యెందైనఁ గలఁడా? నీవు నాకుఁ బంచప్రాణములర్పించుతరి నీచరిత్ర నే నించుకయు గ్రహింపఁజాలక నెట్టిదుర్మార్గ మొనర్చితిని ఇంక నేను నిన్నెట్లు చూడగలను. పాపము! ఆ నిరపరాధికూడ నా మూలమున హతుండాయెనే!,, యని యనుచుండ, జయసేనుం డారోగ్యముగ నున్నసంగతి వారిరువురకు నర్మద యెఱుకపరుప వారు పరమానందభరితు లయిరి.

వసంతకనకాంగులు జరిగినసంగతినంతయు నతిచిత్రముగఁ జెప్పుకొనుచు, విచారించుచు దుష్టబుద్ధిదుర్మార్గమున కాతని నిందించుచు నాతనిభార్యయయ్యును, మిగుల సుగుణరాసియగుటచే నర్మదను స్తోత్రము చేయుచుండిరి.

నర్మద, తనభర్తచే వంచింపఁబడినవా రందఱును దనచే రక్షింపఁబడుటచే మిగుల నానందించుచుండెను.

—: ఇరువదిమూఁడవ ప్రకరణము. :—

చం॥ పరులనుఁ జిక్కులం బఱుపభావమునందుఁ దలంచువాండ్రయో
గురుతరమైనచిక్కులఁ దగుల్కొనుచుందురు దామె ధారుణిన్
ద్వరితగతిం గవాటములు ద్వారనిరోధము చేయఁ బోయి, దు
ర్ధరదృఢశృంఖలార్గళవిధాననిరుద్ధము లౌను; మిత్రుఁడా॥

శ్రీసూక్తివసుప్రకాశిక.

పూర్వపురోజులలో శిక్షలతిఘోరముగ నుండెడివి. అపరాధుల ననేకవిధములుగ శిక్షించుచుండిరి. కొన్ని నేరములకుఁ జిత్రవధ, కొన్ని నేరములకు ముండ్లపై దొర్లించుట, కొన్నిటికి దుష్టకీటకములచేఁ గఱపించుట, కొన్నిటికి వేడినూనిలో ముంచుట మొదలగుశిక్షలపరాధులకు విధింపఁబడి యుండెను.

ఇంగ్లీషువారిపరిపాలనయందపరాధుల శిక్షలలోఁ గొన్నికొన్ని మార్పులు జరిగెను. కాఁబట్టి యట్టిఘోరశిక్షలన్నియు నడుగంటినవి. నేరమునకు, జుర్మానా, ఖైదు ద్వీపాంతరవాసము, ఉరి, మొదలగుశిక్షలిపుడేర్పాటు చేయఁబడి యున్నది. పరిపాలకులిట్టికట్టుబాట్లు చేసియున్నను, కపాలకుఁడు మొదలగుదోపిడినాయకు లపరాధులకుఁ బూర్వపుశిక్షలనే విధించుచున్నారు.

కపాలకునిగుహయందు చీఁకటికొట్టొకటి కలదు. అందు దుష్టకీటకము లుంచఁబడియున్నవి. అవి మనుజుల ప్రాణములఁ దీయఁజాలక పోయినప్పటికి మిగుల నెక్కుడు బాధ లిచ్చును.

ఆకొట్టునందే కను కూర్చుండి, "అయ్యో! నేనేమిచేయుదును. నేను చేసినదుర్మార్గమునకుం దగినఫల మిచ్చటనే యనుభవించుచుంటిని. నరకమన నెచ్చటనో యుండునా! ఇది నరకము కాదా? స్వర్గనరకములు రెండు నీలోకముననే యున్నవి. నేను చేసినదుర్మార్గములకు నాయంతరాత్మ నన్ను బాధించుట లేదా? అది నరకము కాదా? అంతకన్న వేఱునరకమేమి కావలయు? వాటికన్నిటికంటె వేయిమడుంగు లెక్కుడునరకముగు నీదుష్టకీటకముల బాధ—కపాలకుఁడును నాతని భృత్యులకృత్యములు—ఇదియంతయు నరకముగాదా!

అయ్యో! నేనెట్టిఘాతుకకార్యము లొనర్చితిని. ప్రాణస్నేహితుండని నన్ను నమ్మియున్న వసంతజయసేనులకుం బడరాని పాట్లను గల్పించితిని. అత్యంతానురాగులగు భార్యాభర్తలకు వైరము గల్పించి వారియుభయుల నాశనమునకుం బ్రయత్నించితిని. ఆడుదానివలెఁ జాటుననుండి మిత్రుఁడని తలపోయుక్రూరసేన జయసేనుల వధించితిని. పాపము! ఆపతివ్రతాశిరోమణియగు కనకాంగిపై నిందారోపణఁ జేసితిని. అట్టిపాపి కిట్టిపాటు గాక యింకెట్టిపాటు లభించును. జయసేన, వసంత, కనకాంగులారా! మీరే నాకుఁ బ్రత్యక్షదేవతలు. మిమ్ముల నే నెల్లప్పుడును స్మరణచేయుచుండెదను.

ఈదుష్టకీటకములకాట్లచే నాశరీరమంతయు మొద్దుపారినది. విషక్రిమివోలె బాధలభ్యాసవశమున సుఖముగఁ దోఁచునట్లు నాకీబాధలన్నియుఁ బరిపాటిగ నున్నవి. నాపా,

ణములు నన్ను బాయుటలేదు.

"అయ్యో! నానర్మద యేమాయెనోగదా! నాకై యెట్లువిలపించుచుండునో! ఆమె కింక దిక్కెవరు? పాపము ఆకాంత నాకుఁ బంచప్రాణము లర్పింప నేనామెయం దనురాగములేక నటించితిని. ఎట్లాలోచించినను నేను చేసినసత్కార్య మొకటియు లేదు. అట్టిచో నాకెట్లు ముక్తిమార్గము సంఘటింపఁగలదు.,,

ఇట్లు తలపోయుచుండఁ గపాలకుఁ డచ్చటి కేతెంచి "ఓరీ! దుర్మార్గా! రాజపుత్రిస్థానముపై దండువెడలు మని నాకు స్నేహభావమున వ్రాసినట్లు జాబు వ్రాసి నన్ను మోసముచేయ నెంచితివిగా? దానికిఁదగినపాపఫల మనుభవింపుము.,, అని తనచేతనున్న కొరడాతో రెండుదెబ్బలు కొట్టెను. "అయ్యో! చచ్చుచున్నా,, నని దుష్టబుద్ధి యేడ్చుచుండెను.

——

—:ఇరువదినాల్గవ ప్రకరణము:—

ఉ॥ సారెకుఁ గూయఁ జొచ్చెఁ బరుషధ్వనిఁ గుక్కుటరాజిప్రాక్కకె
శ్రీరుచి వేగుచుక్క పొడిచెం దలచూపె ననూరురేఖ కా
సారతరంగిణీవిటపిసంతతిఁ బర్వెశకుంతనాదముల్।
దూరములయ్యెఁ జీకటులు దూరపుఁ దెల్వివహించె వేకువన్॥

సత్యహరిశ్చంద్రీయము.

ఆరావళిపర్వతప్రాంతమున నొకపురుషుఁ డుతిరుగాడుచుండెను. ఆతని ముఖము నల్లగానున్నను ముఖవర్చస్సును బట్టి

చూడ మిగులసుందరుఁడుగ నుండెను. ఆ పురుషుండు సుమారిరువదివత్సరముల బాలునివలెఁ గానవచ్చుచుండెను. ఆతండేమికారణముననో దోపిడిగాండ్రతోఁ జేర నెంచుచుండెను. ఇట్టిదురాచారము నం దితని కిట్టిబాల్యముననే మనసు చొరుచుండుట చూడ నత్యంతాశ్చర్యముగ నున్నది.

ఇట్లుండ నొకనాఁడు కపాలకుఁ డీబాలునిఁ జూచి "బాలకా! నీవు చూడఁగ సుకుమారునివలెఁ గానవచ్చుచున్నావు. అట్టి నీకు మాకృత్యము లలవడునా? మావలె నీవు మాతో గష్టసుఖముల కోర్చి యుండఁగలవా?,, యనియడిగెను. అందులకా బాలుఁడు, "అయ్యా! యిష్టమున్నచో నెట్టికష్టమునైన నోర్చుకొనఁగలము. నావిషయమై మీరెంచుకయు ననుమానింపవలదు" దనెను. కపాలకుఁ డాతనియం దనురాగ ముద్భవింప నాతనిఁ దనజట్టులోనికిఁ జేర్చుకొనెను.

కపాలకుఁ డీతనికి గుహయందలి విశేషము లన్నింటిని జూపించెను. అందలి ధనాగారముల నీతఁడు గాంచి నిశ్చేష్టుండాయెను. గుహాయంతయు పరీక్షించుచుండ నొకయార్తధ్వని విననాయెను. ఆ ధ్వనిని విని యాబాలుఁ డేతెంచి యాచీకటికొట్టునందున్న మనుజునిగాంచి తనలో దానేదియో ననుకొనెను. దుష్టబుద్ధి యీతనిగాంచి "ఈతనిముఖము నాకుం బరిచయమున్నట్లు తోఁచుచున్నది. కంఠధ్వనికూడ నెచ్చటనో వినినట్లున్న"దని తలపోయుచుండ నాబాలుఁడు దుష్టబుద్ధిని గాంచి, "అయ్యా! నీవెవరవు! నీకట్టిదుస్థితి యేల సంభవించె"నని

ప్రశ్నించెను. అందుల కాతఁడు, "అయ్యా! నాది రాజపుత్రస్థానము. నాపేరు దుష్టబుద్ధి. నేనుచేసిన దుష్కృత్యములకుం దగిన ఫలము ననుభవించుచున్నా"నని చెప్పెను. "విధి బలవంతమైనపు డెవరేమిచేయఁగలరు. గడచినదానికి వగవఁబనియేమి?,, యని యాబాలుఁ డావలకు వెళ్ళిపోయెను.

ప్రతిదినమునను నాబాలుఁ డచ్చటి కేగి దుష్టబుద్ధిని జూచుచు నాతని నోదార్చుచుండెను. "దుర్మార్గు లగు కటికివారియం దిట్టిసుగుణుఁ డెట్లుండనగును. గువ్వరాలయందు రత్నములు పుట్టునా? ఈబాలునిచరిత మత్యద్భుతముగ నున్న"దని దుష్టబుద్ధి తలపోయుచుండెను.

కపాలకుఁ డీబాలునియం దత్యంతానురాగుఁడై తనవ్యవహారము లన్నింటి నీతనికి వెల్లడి చేయుచుండెను. ధనాగారముల తాళపుచెవు లన్నియు నీతనికట్టడియం దుంచెను. చీఁకటి కొట్టునధికారముగూడ నీతనిమీఁదనే యుంచెను. దుష్టబుద్ధి నీబాలుఁ డతిగౌరవముగఁ జూచుచుండెను. ఈబాలుఁడు కపాలకునితో దుష్టబుద్ధి పశ్చాత్తాపపడుచున్నాఁడు. కాన నాతని వదలివేయుద మని చెప్పెను. అందుల కాత డంగీకరించెను.

మరునాఁడు కపాలకుఁ డీతని నీవలకుఁదీసి నీవీబాలునివలన బాధవిముక్తుండ వైతి వనియాతని వదలి వేసెను.

తెల్లవారుజామున నెవరో యిరువురుపురుషు లతివేగముగ నడచుచుండిరి. వారు కొంతదూర మేగుసరికిఁ

దూర్పున నాకస మెఱ్ఱబారుచుండెను. అది భానునిరాకగా గ్రహించి వేగముగఁ బయనమై పోవుచుండఁ గొంతసరికిఁ దెల్లవారెను. వారుభయులును రాజధానిని గూర్చి పోవుచుండిరి.

కపాలకుఁ డుదయమున లేచి బాలుని గానక గృహమంతయుం జూడ నం దొకచీటి కనుపించెను. అది విప్పి యిట్లు చదువుకొనెను.

"ఓచోరనాయకా! నీవు నాపైఁ జూపినయనురాగమునకు గడు సంతసించితిని. దుష్టబుద్ధి నాభర్తయగుటచే నాతని గ్రహించుటకు నే నీపురుషవేషమున నీయొద్ద కేతెంచితిని. నానాథుని నేను దీసికొనిపోవుచున్నాను. నీయనుజ్ఞ లేకయే వెడలిపోయినందునకు నన్ను క్షమింపుము.

ఇట్లు—నర్మద."

కపాలకుఁ డీజాబు చూచి నర్మద కామెభర్తయందున్నయనురాగమునకుఁ గడు సంతసించుచు వారియం దత్యంతానురాగుఁడై వారిక్షేమముల నరయుచుండెను.

దుష్టబుద్ధినర్మదలు కొంతదూరము ప్రయాణము చేసిన తరువాత దుష్టబుద్ధి, "బాలకా! నీ వెవరవు? నీవునాయాపదలనుండి నన్ను గాచుటకు వచ్చిన ప్రత్యక్షభగవానునివలె నున్నావు. కాకున్న నన్నాదుర్మార్గునుండి విడిపించి నావెంట నంటుదువే? నీ వెవరవు? చెప్పకున్న నీపాదముల విడువఁజాల"నని యాబాలునిపాదములపైఁబడఁబోవ నాతఁడాతని లేవనెత్తి "నాథా! నేను నీనర్మదనుగానా? సరిగాఁ జూడు"మని తన పైవస్త్రముఁ

డీసివైచెను. దుష్టబుద్ధి తనభార్యయగు నర్మద నెదుటం గాంచి సంతోషబాష్పములతో నామెను జూడఁజాలక నిశ్చేష్టుఁడై యుండెను.

నర్మదవలన వసంతకనకాంగులచరిత్రియును, జయసేనుని చరిత్రియును విని కడు సంతసించుచుండెను. నర్మద దుష్టబుద్ధు లతిత్వరితముగా నుదయపురమును జేరిరి.

—♦—

—:ఇరువదినైదవ ప్రకరణము:—

శా॥ ఏయేధర్మములాచరింపనగు నేయే క్షేత్రముల్మెట్టనో।
నేయేతీర్థములందుఁగ్రుంకనగు నేయే దేవతంగొల్వనో।
నాయీపాపముదప్పిపోవుటకనంతా! దీనబంధూ! కృపా
భూ! యాపన్నుఁడ నీవెదిక్కగుముకొల్తున్నిన్ను విశ్వేశ్వరా!

జయసేనుఁడు కొంతకాలమున కారోగ్యవంతుం డాయెను. వసంత కనకాంగులు సుఖులయి యున్నసంగతి యాతనికి దెలిసినప్పటినుండియు వసంతకనకాంగులం జూడవలయునని యత్నించుచుండెను. ఒకనాఁ డతఁడిల్లు వదలి వసంతునిగృహమున కేగెను.

వసంతకనకాంగులును, "మనమీదినమున జయసేనుని జూచుటకు వెళ్లిన బాగుగ నుండు"నని తలపోయుచుండ జయసేనుఁ డచ్చటి కేగెను. వసంతుఁ డాతనిం జూచి సిగ్గుపడుచుండెను. జయసేనుఁడు వారినభయులనుగాంచి, "ఓ జననీజనకులారా మీకుంగలిగిన యిక్కట్టుల కెల్ల నేను కారణభూతుఁడను గదా"

యనెను. అందులకు వసంతుండు "జయసేనా! నాకు నిన్ను జూచుటకు సిగ్గగుచున్నది. మిత్రమా! నన్ను క్షమింపుము. నేను నీ చరిత్రను గ్రహింపఁజాలక దుష్టబుద్ధికి లోనై మిమ్ముల బాధించి నేను బాధపడితిని. నిన్నుఁ జంపఁ బ్రయత్నించినవాఁడు దుష్టబుద్ధి. ఆతండు నిన్ను గాయపరచి క్రూరసేనుని మరణము నొందించెను. జరిగినదానికి వగవంబనిలేదు. నన్ను మన్నించి నీవెప్పటియట్ల నుండఁ బ్రార్థించుచున్నాఁడ"నని చెప్పెను.

వీరిట్లు మాట్లాడుచుండ నర్మద దుష్టబుద్ధు లచటికి కేతెంచిరి. దుష్టబుద్ధి, "వసంతకనకాంగజయసేనులారా! త్రిమూర్తులగు మీరు నాకు శరణీయకున్న నేను బ్రతుకఁజాల"నని వారి పాదములపైఁ బడి "అయ్యలారా! నేను కడు దుర్మార్గుండను. ఛండాలుఁడను. నేనెట్టికఠిననరకమునకైన నర్హుండను. నేను చేసిన తప్పుల నన్నింటిని మన్నింపుఁడు. నా భార్యయగు నర్మదవలన నాకు ముక్తి దొరకినది. మీకృపాదానముచే నన్నాదరింపకున్న నేనిఁక బ్రతుకంజాలను. నేను చేసిన పాపములకు నాకెన్ని జన్మములకైన ముక్తిగలుగునే? యని విచారించుచున్న దుష్టబుద్ధిని వసంతుండు లేవనెత్తి, 'దుష్టబుద్ధీ! విధిబలమున కెవరేమి చేయఁగలరు. ఇందు నీవుచేసినదేమి! ఎవరికర్మను వారనుభవింపక తప్పునా? నీవు వగవఁబనిలేదు. అని యాతని నోదార్చెను.

జయంతుండు దుష్టబుద్ధితిరిగివచ్చినసంగతియు నాతనికిఁ గలిగినపశ్చాత్తాపబుద్ధియు నాతండు గ్రహించి యాతనికి వర్తమాన మంపెను. దుష్టబుద్ధి రాజునొద్దకేగి సాష్టాంగప్రణామం

బులాచరించి తాను చేసిన దుష్కృత్యములకుంగుడువగచి క్షమింపుమని రాజు పాదములపైంబడెను. దుష్టబుద్ధికింగలిగిన పశ్చాత్తాపమునకు రాజు మనమున సంతసించెను. కాని యాతనికిం దిరిగి యుద్యోగపదవి నిచ్చుటకుమాత్ర మాతని కించుకయునిష్టము లేదు.

వసంతుండెప్పటియట్ల జయంతునిముఖ్య సేనానాయకుండుగ నుండెను. జయసేనుం డాతనికిం దప్రధాననాయకుఁడుగ నుండెను. జరిగినవృత్తాంత మంతయు నొక కలవలెనుండెను. కనకాంగి యందరికిని నెక్కుడు గౌరవనీయురాలై యుండెను. ప్రజలందఱును గడు సంతసించు చుండిరి.

ఇట్లుండ నొకనాఁ డాకస మంతయు నిర్మలముగ నుండి పుష్ప వర్షమో యనునట్లు వీరిపై వర్షపుతుంపురలు పడెను. ప్రజలందఱును, "వీరిపై దేవతలు గురుపించిన పూలవర్షమని కడుసంతసించిరి.

వసంతకనకాంగులును, జయసేనకళావతులును, దుష్టబుద్ధిసర్మదలును, నొకరిపైనొక రనురాగము గల్గి సంతోషముగం గాలముం బుచ్చుచుండిరి.

సమాప్తము.

తప్పొప్పుల పట్టి

పేజి	పంక్తి	తప్పు.	ఒప్పు.
12	3	కొద్ది	మంద
,,	18	వృక్షపొంత	వృక్షముపొంత
13	2	స్థానముల	స్థానముల
,,	16	జేయ	సేయ
,,	21	పైపున	నైపున
14	14	కుదర	కుదుర
18	5	వారియుభయులకు	వారిద్దఱకు
,,	15	ఆకందంమున	ఆకందకమున
19	3	స్థంబము	స్తంభము
,,	16	విధేయతో	విధేయతతో
20	9	యేల	నేల
,,	15	కథల	కథల
,,	19	యామె	నామె
23	18	నీపు	నీవు
24	3	కొద్ది	స్వల్ప
26	3	దనకు	దుదకు
27	3	నుంచి	నుండి
,,	5	లోలోప	లోలోపల
30	4	నేడా	నేనా
32	18	నీవిమై	నీవిషయమై
33	14	దోపుడు	దోపిడి
34	5	పడి	మొడి
..	18	ఝంగ్లీషు	నింగ్లీషు
35	5	లమల్ప	లమర్ప

,,	11	రినితోను	రితోను
36	22	సగౌరము	సగౌరవము
37	8	ధన	ధన
39	3	ఆల్లిగబిల్లిగ	అల్లిబిల్లిగ
,,	7	నిలయము	నిలను
41	14	నుమానా	యనుమానా
43	13	వసిష్టుని	వసిష్ఠుని
45	12	యంక	యం
47	11	నాలోచించు	యాలోచించు
48	10	తనమాటచే	తనమాటలచే
50	20	కిండవంతి	కింవదంతి
55	3	కిచ్చిది	కిచ్చిన
66	22	పెట్ట	పెట్టు
68	20	ఉంద్యోగ	ఉద్యోగ
75	21	రాజ్య	రాజ
76	5	కళావతీ	కళావతి
78	21	మొకగుమస్తా	మొకగుమాస్తా
80	13	ఔక్కలేకేమి	ఔక్కల్లేకేమి
,,	16	కొంచం	కొంచెం
82	1	లపింప	పిలపింప
83	7	నెట్టి	యొట్టి
,,	16	అందరు	రందఱు
84	17	యున్నన	యున్నవి
88	7	నోదార్చుండెను	నోదార్చుచుండెను

ఫరా ,,వద్ద,, అనియున్నచోట ,,యొద్ద,, అని చదువవలెను.

నవీనాచారమునుబట్టి సందర్భానుసారముగా సరళాదేశములున్ను, ద్రుతానుస్వారములున్ను, శకటరేఫములున్ను అంతగా పాటింపలేదు.

END OF
TITLE